@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512
మన వార్త
AP EDITION
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
గురువారం 24 సెప్టెంబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-



తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



## 'ఓట్ల చోరీ' ఆరోపణల్లో వాస్తవం లేదు

- ఈసీలో విభేదాలపై విపక్షాల విమర్శలను తిప్పికొట్టిన బీజేపీ
- ఓట్ల తొలగింపుతో బెంగాల్‌లో తామే ఎక్కువ నష్టపోయామని వెల్లడి
- కమిషనర్ల మధ్య చర్చలు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమని వ్యాఖ్య
- ఎన్నికల్లో గెలవలేకే సంస్థలపై కాంగ్రెస్ దాడి చేస్తోందని ఆరోపణ



## 2047 నాటికి వికసిత్ భారత్ సాధించడమే మన లక్ష్యం

- టూరిజం సమ్మిట్ లో 'చరైవేతి.. చరైవేతి' శ్లోకాన్ని ఉటంకించిన కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్
- పర్యాటక అనుకూల విధానాలను వివరించిన కేంద్ర మంత్రి
- పర్యాటక రంగంతో ఉపాధి అవకాశాలు విశేషంగా పెరుగుతున్నాయని వెల్లడి

# హెల్త్ కేర్ హబ్‌గా అమరావతి



- ప్రపంచశ్రేణి సంస్థగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్
- ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు భూమిపూజ చేసిన సీఎం చంద్రబాబు
- "ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ రావడం అమరావతికి గర్వకారణం
- అమరావతిలో నిర్మించే ఈ ఇనిస్టిట్యూట్ ప్రపంచశ్రేణి సంస్థగా ఎదగాలి
- కంటి చికిత్సలే కాకుండా పరిశోధన, శిక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నారు.
- నో పోల్, బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ సిటీగా అమరావతి.

**అమరావతి**

దేశవ్యాప్తంగా అమరావతి గురించి మాట్లాడుకుంటున్నారని, కానీ రాష్ట్రంలోనే దాని ప్రాధాన్యతను గుర్తించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం వద్ద ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణానికి సీఎం భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. అమరావతిలో 12 ఎకరాల్లో నిర్మించే ఎల్వీ ప్రసాద్ - మిగతా3లో



# ఎడతెరిపి లేని భారీ వర్షం

- తీవ్ర వాయుగుండం ప్రభావం
- గోదావరి జిల్లాల్లో దంచికొడుతున్న వానలు
- బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో గోదావరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు
- ఎడతెరిపి లేని వానలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి
- లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి

**అమరావతి**

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఉమ్మడి గోదావరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేని వానలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజమహేంద్రవరం నగరంలో 55 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షం కారణంగా నగరంలోని - మిగతా3లో

## 'సర్'పై నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నవే

- ఎస్ఐఆర్ నిర్ణయాలపై ఇద్దరు ఈసీ సభ్యులు 14 సార్లు అభ్యంతరాలు తెలిపారన్న మీడియా కథనం
- ఈసీ తీరుపై కాంగ్రెస్, సీపీఎం విమర్శలు
- రాజకీయ పార్టీల విమర్శలపై క్లారిటీ ఇచ్చిన ఈసీ




# కూటమి ప్రభుత్వంపై గవర్నర్‌కు ఫిర్యాదు



- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్
- శాప్ కార్యాలయం వద్ద దాడి చేసి, బాధితులపైనే కేసులు పెట్టారని ఆరోపణ
- నకిలీ సర్టిఫికెట్లు, జీవోలతో నియామకాలు జరిపి తర్వాత రద్దు చేశారని వెల్లడి
- న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేసిన జగన్

## ఎన్నికలు జరిగే రాష్ట్రాలపై బీజేపీ

- తెలంగాణకు సునీల్ భన్సల్
- ఏపీకి అరవింద్ భదౌరియా
- రాష్ట్రాలకు కొత్త ఇన్‌ఛార్జ్‌లను ప్రకటించిన బీజేపీ
- హరియాణా, ఛత్తీస్‌గఢ్‌లకు ఇన్‌ఛార్జిగా స్మృతి ఇరానీ
- 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు కొత్తగా ఇన్‌ఛార్జిలను, కో-ఇన్‌ఛార్జిలను నియమిస్తూ ఆదేశాలు





## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే!

- ఎన్నికల కమిషన్‌పై ప్రియాంక గాంధీ తీవ్ర వ్యాఖ్యలు
- ఎన్నికల రిగ్గింగ్ గురించి తెలిసి సీఈసీ అనుమతిస్తే దేశద్రోహమని వ్యాఖ్య
- ఈసీలో అవకతవకలపై వస్తున్న కథనాలు అత్యంత తీవ్రమైనవని వ్యాఖ్య
- ఈ ఘటనపై సరైన దర్యాప్తు జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్

# రాష్ట్రంలో నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లు



- రాష్ట్రంలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా 4 కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటు
- మంత్రివర్గ సమావేశంలో 60కి పైగా అంశాలపై కీలక నిర్ణయాలు
- చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గ సమావేశం
- ఐటీ, క్వాంటమ్ టెక్నాలజీ రంగాలకు పెట్టుబడుల ఆకర్షణపై కేబినెట్ దృష్టి
- క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ కింద ఏడు సంస్థలకు భూమి, కార్యాలయ స్థలం, విద్యుత్, నీరు, ప్రోత్సాహకాలు కల్పించేందుకు నిర్ణయం

**అమరావతి**

రాష్ట్రంలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా 4 కొత్త కమిషనరేట్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. రాజధానిలో మౌలిక వసతులకు మరో 2 వేల కోట్లకుపైగా కేటాయించింది. భారీ పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటు, విద్యుత్ మౌలిక వసతులకు సంబంధించిన కీలక ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పలు రంగాల్లో పెట్టుబడులకు మార్గం సుగమం చేసింది. ఆంధ్రప్రదేశ్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ పాలసీకి ఆమోదముద్ర వేసింది. దాదాపు 4గంటల పాటు సమావేశమైన మంత్రివర్గం 60కిపైగా అంశాలపై నిర్ణయాలు తీసుకుంది. కొత్తగా రాజమహేంద్రవరం, - మిగతా3లో

# దక్షిణాఫ్రికాలో దారుణం

- దక్షిణాఫ్రికాలో దారుణమైన కాల్పుల ఘటన
- ఇంట్లో పార్టీ చేసుకుంటుండగా జరిపిన దాడిలో 11 మంది మృతి
- మృతుల్లో గర్భిణీ మహిళ కూడా ఉన్నట్టు వెల్లడి
- నిందితుల కోసం 72 గంటల ఆపరేషన్ ప్రారంభించిన పోలీసులు
- మృతుల్లో కొందరికి నేర చరిత్ర ఉన్నట్టు ప్రాథమిక విచారణలో గుర్తింపు



# 'సర్'పై నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నవే




దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్?ఐఆర్?)లో పలు రాష్ట్రాల్లో ఓటర్ల పేర్ల తొలగింపుపై ఎన్నికల కమిషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన మీడియా కథనంపై ఎన్నికల సంఘం (ఈసీ) స్పందించింది. కమిషన్ జారీచేసే అన్ని అధికారిక ఆదేశాలు, నిర్ణయాలు, పరిపాలనాపరమైన సూచనలకు పూర్తి చట్టబద్ధత ఉంటుందని వెల్లడించింది. సర్ ప్రక్రియపై నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నవే అని, ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకుతావులేదని ఈసీ తెలిపింది. ఇవన్నీ ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం నిర్దేశించిన చట్టబద్ధమైన విధానాల ప్రకారమే జరుగుతాయని తెలిపింది. అయితే, ఏ సంస్థలోనైనా నిర్ణయాలు తీసుకునే ముందు జరిగే చర్చల్లో భిన్నాభిప్రాయాలు సాధారణమేనని పేర్కొంది. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో తన రాజ్యాంగవిధులను పూర్తి చిత్తశుద్ధితో నిర్వర్తించేందుకు కట్టుబడి ఉన్నట్లు ఈసీ పునరుద్ఘాటించింది. ముసాయిదా దశలో కమిషన్ సభ్యులు అడిగే ప్రశ్నలు లేదా ఇచ్చే సూచనలు, ఓటర్ల హక్కులను కాపాడేందుకు చేసే పరిపాలనా ప్రక్రియలో భాగమేనని వివరించింది. ఎన్నికల వ్యవస్థను మెరుగుపరచటానికి కేవలం ముగ్గురు కమిషనర్లు మాత్రమే కాకుండా కమిషన్‌లో ప్రతి అధికారి సూచనలు ఇవ్వటానికి పూర్తి అధికారం కలిగి ఉన్నారని ఈసీ స్పష్టం చేసింది.

**అసలేం జరిగింది?**

ఎస్ఐఆర్ ప్రక్రియ దేశవ్యాప్త అమలు ముగ్గురు కమిషనర్ల పర్యవేక్షణలో జరుగుతోంది. అయితే, ఈ? ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ఎన్నికల సంఘంలోని ముగ్గురు కమిషనర్లలో ఇద్దరైన సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి, పదేపదే ప్రశ్నలు లేవనెత్తారని ఓ వార్తా పత్రిక ఇటీవల వెల్లడించింది. తమకు తెలియకుండానే తీసుకున్న నిర్ణయాలు, జారీ చేసిన ఆదేశాలపై సుఖ్?బీర్? సింగ్?, వివేక్? జోషి గత 10 నెలల్లో కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆ వార్తా పత్రిక నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. సర్ ప్రక్రియలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తాయి. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠను, విశ్వసనీయతను ఆయన పూర్తిగా దిగజార్చారని ఆరోపించాయి. తక్షణమే ఆయన్ను సీఈసీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశాయి. ఈసీని ఏదో అదృశ్యశక్తి నడిపిస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. మెజారిటీ సభ్యుల ఆమోదం లేకుండా తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకపక్షంగా భావించాల్సి ఉంటుందని పేర్కొంది. ఓటుచోరీ ద్వారా బీజేపీ, ఆర్?ఎస్?ఎస్?, ఈసీ దేశద్రోహానికి పాల్పడ్డాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్? గాంధీ బుధవారం ఆరోపించారు. ఓట్ల చోరీ అనేది రాజ్యాంగంపై ప్రత్యక్ష దాడి అని దుయ్యబట్టారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఈసీ అధికారులను గతంలో హెచ్చరిస్తూ తాను చేసిన వ్యాఖ్యలను ఎక్స్? పోస్టులో పేర్కొన్నారు.

**కోట్లాది మంది పేర్లను తొలగించి, బోగస్ ఓట్లను చేర్చారు!**

మరోవైపు, పైస్థాయి నుంచి వచ్చిన ఆదేశాలతో కోట్లాది మంది పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించి, బోగస్ ఓట్లను చేర్చారని కేసీ వేణుగోపాల్ విమర్శించారు. సర్ ప్రక్రియను రద్దు చేసి సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేయాలని ఆప్ జాతీయ సమన్వయకర్త కేజ్రీవాల్ అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలో ఈసీ ఏకచ్ఛత్రాధిపత్యంగా మారిందని సీపీఎం దుయ్యబట్టింది. వెంటనే పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి సీఈసీ అభిశంసన ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేసింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ జైలుకు వెళ్లటం ఖాయమని శివసేన-యూబీటీ ఎంపీ సంజయ్ రౌత్ జోస్యం చెప్పారు. ఆయనను వెనుక ఉండి నడిపిస్తున్న పెద్దలు దేశం విడిచి పారిపోవడం ఖాయమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు సీఈసీని అభిశంసించాల్సిన సమయం ఆసన్నమైందని టీఎంసీ రాజ్యసభాపక్ష నేత డెరిక్ ఒబ్రెయిన్ అన్నారు.

# ఎన్నికలు జరిగే రాష్ట్రాలపై బీజేపీ



భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులకు అధిష్ఠానం రాష్ట్రాల బాధ్యతలను అప్పగించింది. 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు కొత్తగా ఇన్‌ఛార్జిలను, కో-ఇన్‌ఛార్జిలను నియమించింది. ఏపీకి ఇన్‌ఛార్జ్?గా అరవింద్ భదౌరియా, తెలంగాణ ఇన్‌ఛార్జ్?గా సునీల్ భన్సల్‌ను నియమిస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బంగాల్ బాధ్యతలను కూడా సునీల్ భన్సల్‌కు అప్పగించారు. అనిల్ బలూని బీజేపీ కమ్యూనికేషన్ సెల్ కో-ఆర్డినేటర్‌గా, ఆశిష్ అగర్వాల్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ చేసిన ఈ నియామకాలన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయి అని పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. దేశ రాజధాని ఢిల్లీకి వినయ్ సహస్రబుద్ధేను ఇన్‌ఛార్జిగా నియమించారు. సీనియర్ బీజేపీ నేత వినయ్ సహస్రబుద్ధే ఢిల్లీకి ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించనుండగా, జమ్‌యాంగ్ సెరింగ్ నామ్‌గ్యాల్, దర్శన జర్దోష్ సహ-ఇన్‌ఛార్జ్‌లుగా ఉంటారు. హరియాణా, ఛత్తీస్‌గఢ్‌లకు స్మృతి ఇరానీ ఇన్‌ఛార్జ్?గా వ్యవహరించనున్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి ఒడిశా ఇన్‌ఛార్జ్?గా బాధ్యతలు అప్పగించారు. పార్టీ ఉపాధ్యక్షుడు రామ్ మాధవ్‌కు తమిళనాడు, ఉత్తరాఖండ్ రాష్ట్రాల బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలపైన బీజేపీ దృష్టి సారించారు. ఈ మేరకు బీజేపీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డేను ఉత్తరప్రదేశ్ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. జగదీష్ పటేల్, మేధా కులకర్ణి, ప్రదీప్ వర్మ, ఆనంద్ ఓజా సహ-ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరిస్తారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న మరో రాష్ట్రమైన గుజరాత్‌కు రాజ్యసభ ఎంపీ తరుణ్ చుగ్ ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. పంజాబ్‌తో పాటు జమ్మూ కాశ్మీర్‌కు సతీష్ పూనియాను ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ఢిల్లీ బీజేపీ మాజీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా, రాజ్యసభ ఎంపీ అల్కా గుర్జార్‌లను సహ-ఇన్‌ఛార్జ్‌లుగా నియమించారు. అటు ఎన్నికలు జరిగే మణిపూర్ బాధ్యతలను అసోంకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రాజీవ్ రాయ్‌కు అప్పగించారు. కేంద్ర మాజీ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్‌కు గోవా బాధ్యతలు అప్పగించారు.

బీజేపీ ఉపాధ్యక్షుడు బైజయంతి జై పాండాను మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా నియమించగా, అమిత్ మాలవీయ, సదానంద షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్ సహ-ఇన్‌ఛార్జ్‌లుగా నియమితులయ్యారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీకి హరియాణ, ఛత్తీస్‌గఢ్ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించగా, మరో జాతీయ ప్రధాన కార్యదర్శి హరీష్ ద్వివేది బిహార్, కర్ణాటక రాష్ట్రాలకు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తారు. జాతీయ కార్యదర్శి స్వదేశ్ సింగ్ సహ-ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తారు. త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లవ్ కుమార్ దేబ్‌ను మధ్యప్రదేశ్ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు.

**కొత్త టీమ్‌తో ఎన్నికల వ్యూహం**

ఇదిలా ఉండగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కొత్త టీమ్‌ను ఇటీవలె ప్రకటించారు. అనుభవజ్ఞులతో పాటు యువ నాయకులకు ప్రాధాన్యం కల్పిస్తూ కొత్త బృందాన్ని నియమించారు. జాతీయ ప్రధాన కార్యదర్శులుగా అమేఠీ మాజీ ఎంపీ స్మృతి ఇరానీ, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లబ్ కుమార్ దేబ్, సునీల్ బన్సల్, వినోద్ తావ్డే, సతీశ్ పూనియా, గజేంద్ర పటేల్, హరీశ్ ద్వివేది, సంజయ్ భాటియాలకు కీలక బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో పలువురు సీనియర్ నేతలను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించారు. మాజీ రాజస్థాన్ సీఎం వసుంధరా రాజే, మాజీ ఉత్తరాఖండ్ సీఎం తీరథ్ సింగ్ రావత్, రామ్ మాధవ్, బైజయంత్ పాండా, డీ పురందేశ్వరి తదితరులకు ఈ జాబితాలో చోటు దక్కింది. మొత్తం 13 మంది కొత్త ఉపాధ్యక్షుల్లో ఆరుగురు మహిళలు ఉండటం విశేషం.

# సరిహద్దు ఉగ్రవాదాన్ని పరిష్కరించాలి!




భారత్ అంతర్గత విషయాలపై మాట్లాడే అధికారం ఓఐసీకి లేదని విదేశాంగ శాఖ తేల్చిచెప్పింది. జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు పూర్తిగా భారత్‌లో అంతర్భాగమని, రాజకీయ ప్రేరేపిత ప్రచారాలతో ఈ వాస్తవాన్ని ఎప్పటికీ మార్చలేరని భారత విదేశాంగ శాఖ కుండబద్దలు కొట్టింది. న్యూయార్క్‌లో జరిగిన ఓఐసీ కాంటాక్ట్ గ్రూప్ భేటీకి అజర్‌బైజాన్, పాకిస్థాన్, తుర్కియే, సౌదీ అరేబియా, నైగర్ విదేశాంగమంత్రులు హాజరయ్యారు. సమావేశం తర్వాత విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో భారత్‌కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను విదేశాంగ శాఖ తోసిపుచ్చింది. ప్రేరేపిత కథనాలను ఓఐసీ పదేపదే సమర్థించడం ఆ సంస్థ విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని విమర్శించింది. తప్పుడు ప్రచారానికి వేదిక కల్పించడం మానుకొని ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్న పాకిస్థాన్‌కు సరైన సలహా ఇవ్వాలని ఓఐసీకి సూచించింది.

ఇందుకు సంబంధించి విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ పోస్టులో స్పందించారు. "భారతదేశానికి పూర్తిగా అంతర్గతమైన విషయాలపై తీర్పు చెప్పడానికి ఓఐసీకి ఎటువంటి అధికారమూ లేదు. జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు భారత్?లో అంతర్భాగం. రాజకీయ ప్రయోజనాల కోసం ఎంతగా ప్రచారం చేసినా ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరు" అని తేల్చి చెప్పారు.? వ్యతిరేక ప్రచారాల కోసం తమ వేదికను ఉపయోగించుకోవద్దని, దానికి బదులుగా ఈ ప్రాంతంలో అస్థిరతకు మూలకారణమైన సరిహద్దు ఉగ్రవాదాన్ని పరిష్కరించాలని భారత్? ఓఐసీని కోరింది. "భారత్?పై బురదజల్లేందుకు పాకిస్థాన్‌కు అవకాశం ఇవ్వడానికి బదులుగా, ఆ దేశానికి తగిన బుద్ధి చెప్పాలి. సరిహద్దు ఉగ్రవాదానికి మద్దతు ఇస్తూ, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న రికార్డు పాకిస్థాన్‌కు ఉంది. తొలుత పాకిస్థాన్ తన భూభాగంలో ఉన్న ఉగ్రవాద ముప్పుపై దృష్టి సారించి, అంతర్గత సమస్యలను పరిష్కరించుకునేలా ఓఐసీ కౌన్సిలింగ్ ఇవ్వాలి" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

**పరిస్థితులు దారుణంగా ఉన్నాయి!**

గతేడాది మే నెలలో జరిగిన పహల్గాం దాడికి వ్యతిరేకంగా భారత్ జరిపిన సైనిక చర్యను ఈ కూటమి తప్పుబట్టిందని భారత్ పేర్కొంది. ఉగ్రవాదాన్ని సమర్థిస్తూ, పాకిస్థాన్ ప్రభుత్వానికి సంఘీభావం తెలపడం ఓఐసీ పక్షపాత వైఖరికి నిదర్శనమని వ్యాఖ్యానించింది. అంతేకాకుండా, పాక్? ఆక్రమిత జమ్మూకశ్మీర్, గిల్గిట్-బాల్టిస్థాన్?లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, ముఖ్యంగా, పెరుగుతున్న ఇంధన ధరలు, బలహీనమైన పర్యటక కార్యకలాపాలు, దీర్ఘకాలిక ఆంక్షల కారణంగా అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాక్? ఆక్రమిత జమ్మూకశ్మీర్ నివాసితులు, వ్యాపారాలు, విద్యార్థులపై ప్రభావం చూపుతోంది. ప్రభుత్వ ఉద్యోగాలు, పర్యాటకం మాత్రమే ఈ ప్రాంతానికి ప్రధాన ఉపాధి వనరులుగా మిగిలిపోవడంతో పరిస్థితి మరింత కష్టంగా మారిందని పీఓకే స్థానిక నివాసి పేర్కొన్నారు. "పరిస్థితి రోజురోజుకీ దిగజారుతోంది. లాక్‌డౌన్ ఉంది, ద్రవ్యోల్బణం కూడా పెరుగుతోంది. ఇటీవల పెట్రోల్ ధరల పెరుగుదల జీవన వ్యయాన్ని మరింత పెంచింది. 90 రోజులు గడిచినా, పీఓకేలో ఇప్పటికీ ఇంటర్నెట్ సేవలు లేవు. మొబైల్ సేవలకు అంతరాయం కలగడంతో ప్రజలు కాల్స్ చేసుకోవడం కూడా కష్టంగా మారింది" అని హమీద్ అన్నారు. అయితే, జూన్ నుంచి పీఓకేలో పదేపదే జరుగుతున్న నిరసనలతో పాటు ఆర్థిక ఒత్తిళ్లు కూడా తలెత్తాయి. ఈ నిరసనల్లో ధరలు, విద్యుత్ ఖర్చులు, విద్య ఇతర ప్రాథమిక సమస్యలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాక్ ఆక్రమిత జమ్మూకశ్మీర్ మానవ హక్కుల మండలి, ముఖ్యంగా రావల్కోట్, పూంచ్, సుధనూటి జిల్లాల్లో 100 రోజులుగా కొనసాగుతున్న నిరసనలు, అశాంతిపై ఇటీవల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కౌన్సిల్ పోస్ట్ ప్రకారం, ఈ దీర్ఘకాలిక పరిస్థితి అనిశ్చితిని సృష్టించిందని, పీఓకే అంతటా విస్తృత ప్రభావాన్ని

## దక్షిణాఫ్రికాలో దారుణం

దక్షిణాఫ్రికాలో ఘోర కాల్పుల ఘటన చోటుచేసుకుంది. క్వాజులు-నాటల్ ప్రావిన్స్‌లోని క్వామాఖుతా పట్టణంలో దుండగులు జరిపిన కాల్పుల్లో 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటనకు సంబంధించిన వివరాలను స్థానిక పోలీసులు బుధవారం వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం, మంగళవారం రాత్రి పట్టణంలోని జికో ప్రాంతంలో ఈ దారుణం జరిగింది. ఒక ఇంట్లో 13 మంది పురుషులు, ఓ గర్భిణీ పార్టీ చేసుకుంటుండగా, ముగ్గురు సాయుధ దుండగులు ఒక్కసారిగా లోపలికి ప్రవేశించారు. వారు విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో గర్భిణీ సహా 10 మంది అక్కడికక్కడే మరణించారు. గాయపడిన నలుగురిని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 11కి చేరింది. ఈ ఘటనపై సౌత్ ఆఫ్రికన్ పోలీస్ సర్వీస్ యాక్టింగ్ నేషనల్ కమిషనర్ పులెంగ్ డింపేన్ తీవ్రంగా స్పందించారు. నిందితులను పట్టుకునేందుకు 72 గంటల ప్రత్యేక ఆపరేషన్‌కు ఆదేశించారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను సమీకరించి, ఈ అమానుషానికి పాల్పడిన వారిని త్వరితగతిన పట్టుకుని న్యాయస్థానం ముందు నిలబెట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రాథమిక దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. మృతుల్లో కొందరికి నేరచరిత్ర ఉన్నట్లు, వారు చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు పోలీసు క్రైమ్ ఇంటెలిజెన్స్ విభాగం రికార్డులను బట్టి తెలుస్తోంది. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా ఆ వివరాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. కాల్పులకు గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని వారు పేర్కొన్నారు. కాగా, ఇదే ప్రావిన్స్‌లోని డర్బన్‌లో గత ఏప్రిల్‌లో జరిగిన మరో కాల్పుల ఘటనలో ఇద్దరు మరణించారు.

## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే!

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ఎన్నికల కమిషన్‌తో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని తెలిసి కూడా సీఈసీ వాటిని అనుమతించి ఉంటే, అటువంటి చర్య దేశద్రోహం కిందకే వస్తుందని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం తన వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నీలంబూరులో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) పనితీరులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయని వెలువడిన మీడియా కథనాలపై ఆమె స్పందించారు. ఈ పరిణామాలు ప్రజాస్వామ్యానికి "అత్యంత ప్రమాదకరం" అని ఆమె అభివర్ణించారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సందర్భంగా పేర్ల తొలగింపు సహా పలు ఇతర అంశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అసమ్మతి వ్యక్తం చేశారన్న కథనాలను ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి అక్రమంగా తొలగించారని గత కొంతకాలంగా వస్తున్న ఆరోపణలను ఆమె గుర్తుచేశారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగకపోతే లేదా ఈసీయే అక్రమాలకు సహకరిస్తే, అది ప్రజాస్వామ్యంపై జరిగిన గొడ్డలిపెట్టుగా పరిగణించాల్సి ఉంటుందని అన్నారు. అయితే, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల కమిషన్ ఇదివరకే స్పష్టం చేయడం గమనార్హం.

## 'ఓట్ల చోరీ' ఆరోపణల్లో వాస్తవం లేదు

ఎన్నికల కమిషన్ (ఈసీ)లో విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న వార్తలపై బీజేపీ స్పందించింది. కమిషనర్ల మధ్య అధికారిక చర్చలు, సంప్రదింపులు జరగడం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనమని స్పష్టం చేసింది. ఓటర్ల జాబితా సవరణ విషయంలో విపక్షాలు చేస్తున్న 'ఓట్ల చోరీ' ఆరోపణలను బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలను ఉదాహరణగా చూపారు. "ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు ద్వారా బీజేపీ లబ్ధి పొందిందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. కానీ బెంగాల్‌లో అత్యధికంగా ఓట్లు తొలగించిన 20 స్థానాల్లో 13 సీట్లను టీఎంసీ గెలుచుకోగా, బీజేపీ కేవలం 6 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. అలాంటప్పుడు మేము ఎలా లబ్ధి పొందుతాం?" అని ఆయన ప్రశ్నించారు. ముర్షిదాబాద్ జిల్లాలోని షంషేర్ గంజ్ నియోజకవర్గంలో అత్యధికంగా 91,712 ఓట్లు తొలగించగా, అక్కడ టీఎంసీ అభ్యర్థి గెలిచారని, ఆ ఎన్నికల్లో బీజేపీ కనీస పోటీ ఇవ్వలేకపోయిందని గుర్తుచేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరు అభ్యంతరం వ్యక్తం చేశారని ఓ పత్రికలో కథనం వెలువడిన నేపథ్యంలో ఈ వివాదం మొదలైంది. దీనిపై సంబిత్ పాత్రా స్పందిస్తూ, కమిషనర్ల మధ్య చర్చలు జరిగిన మాట వాస్తవమేనని, అయితే చర్చల అనంతరం అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారని ఈసీ స్వయంగా వివరణ ఇచ్చిందని తెలిపారు. ఇదే ప్రజాస్వామ్య సౌందర్యం అని ఆయన వ్యాఖ్యానించారు. 2014లో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల తిరస్కరణకు గురవుతున్న కాంగ్రెస్, ఇతర విపక్షాలు, ఎన్నికల్లో గెలవలేక ఈసీ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై దాడులకు దిగుతున్నాయని ఆయన ఆరోపించారు.

## 2047 నాటికి వికసిత్ భారత్ సాధించడమే మన లక్ష్యం

న్యూఢిల్లీలో నిర్వహించిన 'ఔ×ాచీ ఐకానిక్ టూరిజం సమ్మిట్'లో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పాల్గొని కీలక ప్రసంగం చేశారు. ప్రసిద్ధ వైదిక మంత్రం 'చరైవేతి.. చరైవేతి' (ఎల్లప్పుడూ ముందుకు సాగిపోతూనే ఉండు) శ్లోకాన్ని ఉటంకిస్తూ... పర్యాటకరంగం నిరంతర పురోగతికి, దేశ ఆర్థిక రంగానికి ఎలా చోదకశక్తిగా మారుతుందో వివరించారు. భారతదేశం వేగంగా పురోగమిస్తోందని, 2047 నాటికి 'వికసిత భారత్' (అభివృద్ధి చెందిన భారత్) సాధించడమే మన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్లోబల్ పర్యాటక పటంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న మౌలిక వసతుల కల్పన, సాంస్కృతిక వారసత్వ పునరుద్ధరణ, పర్యాటక అనుకూల విధానాలను కేంద్ర మంత్రి వివరించారు. దేశంలో ఆధ్యాత్మిక, పర్యావరణ (ఎకో టూరిజం), వైద్య పర్యాటక రంగాలు విపరీతమైన వృద్ధి నమోదు చేస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయ ప్రయాణికులను ఆకర్షించడంతో పాటు స్వదేశీ పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలు విశేషంగా పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

## పుంజుకున్న మార్కెట్లు.. సెన్సెక్స్ 299 పాయింట్లు జంప్

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల స్థాయిలో స్థిరపడటంతో ఇన్వెస్టర్లలో ఆందోళనలు తగ్గాయి. అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు మళ్లీ మొదలయ్యే అవకాశాలపై ఆశలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయి. దీంతో మెటల్, ఆర్థిక రంగ షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 299.17 పాయింట్లు (0.40 శాతం) లాభపడి 74,828.25 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 117.80 పాయింట్లు (0.50 శాతం) పెరిగి 23,446.80 వద్ద ముగిసింది. ఇటీవల చోటుచేసుకున్న ఒడుదొడుకుల తర్వాత సూచీలు కోలుకోవడం గమనార్హం. నిఫ్టీలో టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, హిందాల్కో ఇండస్ట్రీస్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. మెటల్ రంగ సూచీ రెండు శాతానికి పైగా పెరిగింది. ఎఫ్ఎంసీజీ సూచీ కూడా మెరుగ్గా రాణించింది. మరోవైపు ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో నిఫ్టీ ఐటీ ఈరోజు అత్యంత బలహీనమైన రంగ సూచీగా నిలిచింది. విస్తృత మార్కెట్‌లోనూ కొనుగోళ్ల జోరు కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.70 శాతం పెరగగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 0.89 శాతం లాభపడింది. చమురు ధరలు స్థిరపడటంతో ఇంధన వ్యయాలపై ఆందోళనలు కొంత తగ్గాయని, దీంతో ఇన్వెస్టర్లు మళ్లీ కొనుగోళ్ల వైపు మొగ్గుచూపారని మార్కెట్ నిపుణులు తెలిపారు. సాంకేతికంగా నిఫ్టీకి 23,450-23,500 స్థాయి తక్షణ నిరోధంగా మారే అవకాశముందని నిపుణులు పేర్కొన్నారు. 23,500 పైన స్థిరంగా కొనసాగితే 23,600 వైపు కదిలే అవకాశం ఉందన్నారు. ఆ స్థాయిని దాటలేకపోతే పరిమిత శ్రేణిలోనే సూచీ కదలొచ్చని తెలిపారు. దిగువన 23,300 వద్ద తక్షణ మద్దతు, 23,200 వద్ద బలమైన మద్దతు ఉందని వివరించారు.

# కూటమి ప్రభుత్వంపై గవర్నర్‌కు ఫిర్యాదు

డీఎస్సీ అక్రమాలపై విజయవాడలోని క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) కార్యాలయం వద్ద తమ పార్టీ నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారని, ఈ సందర్భంగా తమ నేతలపై దాడి జరిగిందని వైసీపీ అధినేత జగన్ నేడు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. డీఎస్సీ స్కామ్‌కు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని, ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని జగన్ డిమాండ్ చేశారు. గవర్నర్‌తో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్, డీఎస్సీ కుంభకోణం ఎలా జరిగిందో ఆధారాలతో సహా గవర్నర్ కు వివరించినట్లు తెలిపారు. శాప్ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు అనుమతి తీసుకున్నప్పటికీ, అదే సమయంలో, అదే ప్రదేశంలో టీడీపీ గూండాలు ధర్నా నిర్వహించారని ఆరోపించారు. గతంలో 'సాక్షి' కార్యాలయాలపై దాడి చేసిన వారే ఈ దాడిలో పాల్గొని, నిరుద్యోగ యువత, వైసీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి పాల్పడ్డారని అన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బాధితులపైనే ప్రభుత్వం తీవ్రమైన సెక్షన్లతో కేసులు నమోదు చేయడం దారుణమని ఆయన విమర్శించారు. ఈ రెండు ఘటనలతో పాటు డీఎస్సీ పరీక్షల నిర్వహణ నుంచి అభ్యర్థుల నియామకాల వరకు జరిగిన అక్రమాల తీరును గవర్నర్



దృష్టికి తీసుకెళ్లినట్లు జగన్ వివరించారు. ఎస్‌సీఈఆర్‌టీకి నేతృత్వం వహిస్తున్న ఒకే వ్యక్తికి ప్రశ్నపత్రం రూపకల్పన, పరీక్షల నిర్వహణ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఈ పరీక్షల్లో ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంక్ వచ్చినా ఉద్యోగం ఇవ్వలేదని, ఇది ప్రశ్నపత్రం లీక్ అయిందనడానికి నిదర్శనమని వైసీపీ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రత్యేక జీవోలు జారీ చేసి, నియామకాలు పూర్తయ్యాక వాటిని రద్దు చేశారని, ఇది అక్రమాలకు బలమైన ఆధారమని జగన్ అన్నారు. కొందరు అభ్యర్థులు కనీసం టెట్ పరీక్ష కూడా రాయకుండానే ఉద్యోగాలు పొందారని, ఈ విధంగా 372 మందిని నిబంధనలకు విరుద్ధంగా నియమించారని ఆరోపించారు. టీడీపీ నేతల ఆధ్వర్యంలోని సాఫ్ట్‌బాల్, జూడో సంఘాలు జారీ చేసిన నకిలీ క్రీడా ధ్రువపత్రాలతో కొందరు ఉద్యోగాలు సంపాదించారని, ఈ విషయంలో శాప్, సంబంధిత సంఘాల మధ్య పరస్పర విరుద్ధ ప్రకటనలు వస్తున్నాయని తెలిపారు. ఉద్యోగాల అమ్మకాలకు సంబంధించిన ఆడియో, వీడియో ఆధారాలు సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని జగన్ విమర్శించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అన్ని ఆధారాలు ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నందున, మంత్రి లోకేశ్ రాజీనామా చేసి, సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో సుప్రీంకోర్టు చేసిన తీవ్ర వ్యాఖ్యలు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటివని జగన్ గుర్తుచేశారు. ఈ అక్రమాలపై న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# అంబటి అడ్డంగా బుక్కైనట్టేనా

**గుంటూరు :** లిక్కర్ స్కామ్‌లో ఈడీ నోటీసులు ఇస్తే 90 ఎంఎల్ డైలాగులు చెప్పిన అంబటి రాంబాబుకు అసలు నిజం తెలుసు. లిక్కర్ స్కామ్ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేయడంతో ఆయన గారికి అసలు భయం పట్టుకుంది. తొలుత ఈడీ నోటీసులే రాలేదని, తనకేమీ తెలియనట్లు అమాయకపు నటన ప్రదర్శించిన అంబటి.. తీరా విషయం ముదిరి పాకాన పడటంతో నాకేం భయం లేదు.. ఆరోగ్యం కుదుటపడ్డాక విచారణకు వెళ్తా అంటూ కొత్త కవరింగ్ కథనాలు మొదలుపెట్టారు. ఎందుకంటే ఆయన దందాపై పూర్తి సాక్ష్యాలు ఈడీ వద్ద ఉన్నాయి.అంబటి రాంబాబు ఎంత నాటకమాడినా మద్యం కుంభకోణంలో ఆయన పాత్రను దర్యాప్తు సంస్థలు పక్కా ఆధారాలతో పట్టుకున్నాయనేది బహిరంగ రహస్యంగా మారింది. అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో భారీ ఎత్తున సాగిన మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ఈడీ ఈ నోటీసులు జారీ చేసింది. మద్యం విధానంలో జరిగిన అవకతవకలు, నిధుల మళ్లింపు, మనీలాండరింగ్ కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేసిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. తమ ఎదుట విచారణకు హాజరుకావాల్సిందిగా ఆయనను ఆదేశించింది.ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం రవాణా, విక్రయాల ప్రక్రియలో అంబటి రాంబాబు పాత్రపై ఈడీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. మద్యం అక్రమ రవాణాకు సంబంధించిన సబ్ కాంట్రాక్టులను నిబంధనలకు విరుద్ధంగా అంబటి బినామీ సంస్థలకు కట్టబెట్టారనే అభియోగాలు దర్యాప్తులో తెరపైకి వచ్చాయి. మద్యం సిండికేట్ల నుంచి ముడుపులు ఎలా మళ్లాయి, వాటి వెనుక ఉన్న బినామీ నెట్‌వర్క్, డొల్ల కంపెనీల ఆర్థిక లావాదేవీలపై అధికారులు లోతైన ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే పీఎంఎల్ఏ చట్టం కింద అంబటికి నోటీసులు జారీ చేసి సమగ్ర వివరణ కోరింది.ఈ నోటీసుల వ్యవహారాన్ని అంబటి దాచి పెట్టే ప్రయత్నం చేశారు. రెండు వారాలుగా అనారోగ్య కారణాలతో



తాను హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నానని, ఈ క్రమంలోనే ఈడీ అధికారులు ఫోన్ చేసి ఈనెల 11నే నోటీసులు పంపినట్లు చెప్పారని ఆయన పేర్కొన్నారు. అయితే నోటీసులు చేతికి రాకపోవడం వల్లే విచారణకు రాలేకపోయానని, ఏ కేసులో నోటీసులు ఇచ్చారనేది పత్రాలు చూస్తే తప్ప స్పష్టత రాదని అధికారులకు తెలిపినట్లు సమాచారం. మరోవైపు, ఈవారంలోనే హైదరాబాద్ , విజయవాడలోని ఈడీ కార్యాలయంలో ఆయన విచారణకు హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఏపీ లిక్కర్ స్కామ్‌పై ఓవైపు రాష్ట్ర సిట్ , మరోవైపు ఈడీ దర్యాప్తును ముమ్మరం చేస్తుండటంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ కేసులో పలువురు కీలక వ్యక్తులు, ప్రజాప్రతినిధులు దర్యాప్తు సంస్థల విచారణను ఎదుర్కొంటున్నారు. కారుమూరి, ఆయన కుమారుడు జైలు పాలయ్యారు. అంబటి తనకేమీ సంబంధం లేదని బుకాయించే ప్రయత్నం చేసినా.. ఆధారాల్లేకుండా ఈడీ నోటీసులు ఇచ్చే అవకాశం ఉండదు.జగన్ హయాంలో ప్రభుత్వం అధికారంలోకి రాగానే తన బినామీలుగా ప్రచారంలో ఉన్న సుబ్బారెడ్డి, పురుషోత్తం అనే వ్యక్తులను రంగంలోకి దించిన అంబటి.. వారికి మద్యం సరఫరా, డిస్ట్రిబ్యూషన్ కాంట్రాక్టులు కట్టబెట్టారని విచారణలో తేలినట్లు సమాచారం. ఆ కాంట్రాక్టర్ల వద్ద నుంచి భారీ ఎత్తున కమిషన్లు, నిధులు దండుకున్న వైనంపై సిట్, ఈడీలకు సదరు బినామీలే స్వయంగా పూసగుచ్చినట్లు వివరాలు ఇచ్చేశారని, డబ్బులు ఎలా మార్పిడి జరిగాయో ఆధారాలతో సహా అప్పగించారని ప్రచారం జరుగుతోంది.అంబటి గారు అడ్డంగా దొరికిపోవడంతోనే ఇప్పుడు అసలైన వణుకు మొదలైంది. ఇప్పటికే నేతలు కారుమూరి నాగేశ్వరరావు లాంటి వారు జైలు బాట పట్టిన దృశ్యాలు కళ్లముందు కదులుతుండటంతో, ఎక్కడ ఈడీ అధికారులు తనను కూడా నేరుగా అదుపులోకి తీసుకుని రిమాండ్ కార్డ్ ఇస్తారోనని ఆయన భయాందోళనకు గురవుతున్నారు. సాధారణ పోలీసు కేసుల్లా కాకుండా, ఈడీ చట్టం కింద అరెస్ట్ అయితే అంత సులువుగా బెయిల్ రాదని, ఎంతటి వారికైనా కటకటాలు తప్పవని తెలిసి ఆయన నిద్రలేని రాత్రులు గడుపుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.టివి ఛానళ్లలో ఎదుటివారిపై పంచ్‌లు వేస్తూ, వెటకారాలతో కాలక్షేపం చేసిన అంబటి రాంబాబుకు.. ఇప్పుడు తన సొంత బినామీలే ఇచ్చిన వాంగ్మూలాలు పెద్ద ఉచ్చుగా మారాయి. మైకుల ముందు నాకేం భయం లేదు అని ఎంత గంభీరంగా నటించినా, లోలోపల మాత్రం ఈడీ అరెస్ట్ వారెంట్ ఎప్పుడు తలుపు తడుతుందోనని బెదిరిపోతున్నారనేది స్పష్టమవుతోంది. గతంలో నడిపిన లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతుంటే, ఈడీ విచారణ నుంచి తప్పించుకోవడానికి ఆరోగ్యం సాకుగా చూపే కవరింగ్ డ్రామాలు ఇకపై చెల్లకపోవచ్చు.

# పిఠాపురంలో పవన్ మార్క్

**కాకినాడ :** డిప్యూటీ సీఎం క్యాంపు ఆఫీసును పిఠాపురానికి మార్చాలని పవన్ కల్యాణ్ నిర్ణయించుకున్నారు తన వద్దకు సమస్యల పరిష్కారం కోసం వస్తున్న ప్రజల అర్జీలను స్వీకరించడానికి, స్థానిక సమస్యలను నేరుగా పర్యవేక్షించడానికి ఏర్పాటు చేసిన పార్టీ కమిటీ పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మరింత అందుబాటులో ఉండేందుకు డిప్యూటీ సీఎం క్యాంప్ ఆఫీస్‌నే పిఠాపురానికి తరలించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.తన పర్యటనల్లో అనేకమంది ప్రజలు వినతిపత్రాలు చేతుల్లో పట్టుకుని కిలోమీటర్ల మేర నిలబడుతుండటం తనను తీవ్రంగా ఆలోచింపజేసిందని పవన్ కళ్యాణ్ తెలిపారు. పిఠాపురం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు , వారి వినతులను స్వీకరించేందుకు జనసేన తరఫున ఒక ప్రతినిధి కమిటీని నియమించినప్పటికీ, ఆ కమిటీ బాధ్యతాయుతంగా పనిచేయడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడంపై అసహనం వ్యక్తం చేసిన ఆయన, ఇకపై బాధ్యతలను నేరుగా తమ ప్రభుత్వ యంత్రాంగమే చూసుకుంటుందని స్పష్టం చేశారు.స్థానిక నాయకత్వం , కమిటీ పనితీరు సరిగా లేకపోవడంతో, తానే స్వయంగా ప్రజా సమస్యలను పర్యవేక్షించాలని నిర్ణయించుకున్నట్లు పవన్ పేర్కొన్నారు. అందులో భాగంగానే డిప్యూటీ సీఎం క్యాంప్ ఆఫీస్ సేవలను పిఠాపురానికి విస్తరించడం, ఇక్కడి నుంచే నిర్వహించేలా మార్పులు చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. పూర్తిస్థాయి క్యాంప్ ఆఫీస్ ఏర్పాటుకు మరో మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుందని, ఆ తర్వాత స్థానిక పాలన, ప్రజా అర్జీల స్వీకరణ అంతా పిఠాపురం నుంచే జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. కేవలం మాటలకే



పరిమితం కాకుండా, నియోజకవర్గానికి అవసరమైన అభివృద్ధి పనులతో పాటు ప్రజల వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ నిర్ణయంతో పిఠాపురం నియోజకవర్గం త్వరలోనే రాష్ట్ర రాజకీయాలకు , పాలనకు కేంద్రబిందువుగా మారనుంది.ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం శాసనసభ్యుడు పవన్ కళ్యాణ్ తన సొంత నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామం, మున్సిపాలిటీకి అవసరమైన మౌలిక వసతుల కల్పన, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ , ఆధునిక సదుపాయాల సమకూర్చే దిశగా దాదాపు రూ. 1,500 కోట్ల వ్యయంతో బహుళ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పిఠాపురం సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పాలనాపరమైన, ఆర్థికపరమైన సంస్కరణలను వేగవంతం చేస్తున్నారు.ప్రత్యేకించి నియోజకవర్గంలో భూగర్భ జలాల పునరుద్ధరణ, గ్రామీణ పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెరువుల సుందరీకరణకు పవన్ ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ఫకృద్దీన్ పాలెంలో మైసమ్మ చెరువును రూ. 73 లక్షలతో సుందరీకరించి వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ ఎయిర్ జిమ్ వంటి వసతులతో గ్రామ ప్రజలకు ఆహ్లాదకర కేంద్రంగా తీర్చిదిద్దారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 6 కోట్లకు పైగా వ్యయంతో 14 చెరువులను ఆధునీకరించి, గ్రామీణ ప్రాంతాలకు కొత్త శోభను తీసుకువస్తున్నారు.పట్టణ పర్యావరణం, ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు జాతీయ రహదారికి సమీపంలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో రూ.1.83 కోట్ల వ్యయంతో పీఠికాపుర వనం పట్టణ అటవీ ప్రాజెక్టును ఆవిష్కరించారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ఏర్పాటు, పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునీకరణ, మోడల్ అంగన్వాడీ కేంద్రాల నిర్వహణతో పాటు రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపుతున్నారు. పిఠాపురం పుణ్యక్షేత్రమైనందున పర్యాటకాభివృద్ధికి సైతం పెద్దపీట వేస్తున్నారు.అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించేందుకు , పరిపాలనా వేగాన్ని పెంచేందుకు పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కి స్వయంప్రతిపత్తి హోదాను కల్పించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ నేతృత్వంలో పనిచేసే ఈ సంస్థ ద్వారా ప్రణాళికాబద్ధంగా మౌలిక వసతులు, ఆర్థిక వృద్ధి , ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న ఈ చొరవలతో పిఠాపురం రూపురేఖలు వేగంగా మారుతున్నాయి.

## హెల్త్ కేర్ హబ్‌గా అమరావతి

-మొదటిపేజీ తరువాయి

ఐ ఇన్‌స్టిట్యూట్ ఏడాదికి 3 లక్షల మందికి చికిత్స అందించేలా ప్రపంచశ్రేణి సంస్థగా మారాలని సీఎం ఆకాంక్షించారు. కంటి వైద్య సేవలకే పరిమితం కాకుండా పరిశోధన, శిక్షణతో పాటు ప్రత్యేక ఐ అండ్ బ్రెయిన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నోపోల్, బ్లూ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ, కార్బన్ న్యూట్రల్, డీప్‌టెక్ క్యాపిటల్‌గా అమరావతిని నిర్మిస్తున్నామని తెలిపారు. జన్మభూమిలో ప్రతిష్ఠాత్మక సంస్థను ఏర్పాటు చేస్తున్న జీఎన్ రావు, జాస్తి వెంకట్‌లను అభినందిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు మరోసారి అభినందనలు తెలిపారు. "ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ రావడం అమరావతికి గర్వకారణం. అమరావతిలో నిర్మించే ఈ ఇనిస్టిట్యూట్ ప్రపంచశ్రేణి సంస్థగా ఎదగాలి. కంటి చికిత్సలే కాకుండా పరిశోధన, శిక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఐ అండ్ బ్రెయిన్ సెంటర్ కూడా ఏర్పాటు చేయడం అభినందనీయం. నో పోల్, బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ సిటీగా అమరావతి. కార్బన్ న్యూట్రల్, డీప్‌టెక్ కాపిటల్ సిటీగా అమరావతి మారుతుంది. అమరావతి హెల్త్ కేర్ హబ్‌గా మారుతుంది. క్వాంటమ్ వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ గేమ్ ఛేంజర్స్ అవుతాయి. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చేందుకు ప్రణాళికలు రచించాం. భవిష్యత్తు అంతా ఇన్నోవేషన్స్ రంగానిదే. ప్రతి ఆవిష్కరణకు అమరావతే వేదిక కావాలి. సుధా, వెంకట్ జాస్తిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. నేత్ర వైద్యంలో దేశంలోనే నెంబర్‌వన్ సంస్థ, ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్. నాలుగు దశాబ్దాలకు ముందే ప్రజలకు సేవ చేసేందుకు ముందుకొచ్చారు. ఇప్పటివరకు 3 కోట్ల మందికి చికిత్స చేశారు. అమరావతిలో కట్టే ఇనిస్టిట్యూట్, ప్రపంచంలోనే నెంబర్‌వన్ కావాలి. అమరావతిలో 12 ఎకరాలు ఇచ్చాం, ఇంకా కావాలన్నా ఇచ్చేందుకు సిద్ధం. ఏటా 3 లక్షల మందికి చికిత్స చేస్తామని చెప్పారు. పరిశోధనా కేంద్రం కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. గ్లోబల్ స్థాయిలో క్యాంపస్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రపంచంలో ఆరో అతిపెద్ద ఐ ఇనిస్టిట్యూట్ నెలకొల్పారు" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

"ప్రపంచమంతా మెచ్చే నగరంగా అమరావతి మారుతుంది. మన అమరావతిని ప్రపంచమంతా గుర్తిస్తోంది. ప్రపంచంలో ఆరు దేశాల్లోనే క్వాంటమ్ ఉంది, అమరావతికీ వస్తుంది. 21 కంపెనీలు స్టార్టప్‌లతో ముందుకొచ్చాయి. ఏఐ, డేటా సెంటర్, క్వాంటమ్, డీప్ టెక్నాలజీ వస్తున్నాయి. కర్నూలులో అన్ని రకాల డ్రోన్లను తయారు చేస్తున్నారు. సాంకేతికతను అందిపుచ్చుకునే బాధ్యత యువతరానిదే. అమరావతికి అనేక ఉన్నత విద్యాసంస్థలు వచ్చాయి, వస్తున్నాయి. అమరావతిలో రూ.60 వేల కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నాం. అమరావతికి స్పోర్ట్స్ సిటీ, విమానాశ్రయం వస్తాయి. అమరావతి రైతుల త్యాగాలు చరిత్రలో నిలిచిపోతాయి."

## రాష్ట్రంలో నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లు

-మొదటిపేజీ తరువాయి

గుంటూరు, తిరుపతి, కర్నూలు కమిషనరేట్ల ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. రాజమహేంద్రవరం కమిషనరేట్‌లో 3 జోన్లు, అమరావతి క్యాపిటల్ రీజియన్, తెనాలి కలిపి గుంటూరు కమిషనరేట్‌లో 4 జోన్లు ఉండనున్నాయి. తిరుపతి కమిషనరేట్‌లో తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీసిటీ జోన్లు ఏర్పాటు చేయనున్నారు. కర్నూలు కమిషనరేట్‌లో 2 జోన్లతో పాటు 5 సబ్ డివిజన్లు ఉండేలా నిర్ణయించారు.

'రాజధాని అమరావతి గ్రామ పంచాయతీల్లో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ పనులకు పరిపాలనా అనుమతిని 904 కోట్ల నుంచి 1548.98 కోట్లకు కేబినెట్ పెంచింది. అదనంగా 644.98 కోట్లతో నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, స్టార్మ్ వాటర్ నెట్‌వర్క్, రోడ్లు, వీధి దీపాల పనులను విస్తరించనుంది. అసెంబ్లీ భవన స్పైర్, రూఫ్, లిఫ్టులు తదితర నిర్మాణ పనులకు 661 కోట్ల పరిపాలనా అనుమతి ఇచ్చింది. ఒక ఎకరం కన్నా తక్కువ పొడి, జరీబు భూములు ఇచ్చిన అర్హులైన రైతులకు కనీస యాన్యుటీ చెల్లించేలా నిబంధనలు సవరించింది. ఇప్పటికే 1304 మంది ఇలాంటి భూయజమానులకు చెల్లించిన 5.04 కోట్ల యాన్యుటీని ర్యాటిఫై చేసింది.'

**ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు:**

ఐటీ, క్వాంటమ్ టెక్నాలజీ రంగాలకు పెట్టుబడుల ఆకర్షణపై కేబినెట్ దృష్టి సారించింది. క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ కింద ఏడు సంస్థలకు భూమి, కార్యాలయ స్థలం, విద్యుత్, నీరు, ప్రోత్సాహకాలు కల్పించేందుకు నిర్ణయం తీసుకుంది. విద్యుత్, ఇంధన రంగంలో ఆర్థికపరమైన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు హడ్కో రుణం వెయ్యి కోట్లకు, మరో 500 కోట్ల రుణానికి ప్రభుత్వం హామీ ఇచ్చింది. పర్యాటక రంగంలో పలు ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పరిపాలనాపరంగా న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 61 నుంచి 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా అవగాహన కార్యక్రమాల ప్రచారం కోసం సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను గుర్తించి, ధ్రువీకరించి, ఎంప్యానెల్ చేసేలా ఆంధ్రప్రదేశ్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ పాలసీకి ఆమోదముద్ర వేసింది. ఆహార ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, స్టీల్, సిమెంట్, పారిశ్రామిక పార్కులు, సాగునీటి ప్రాజెక్టులు, పట్టణ భూసేకరణకు సంబంధించిన ప్రతిపాదనలపైనా కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ భూముల కేటాయింపులు, ఎక్సైజ్ పాలసీ, వార్డు సచివాలయాల్లో పదోన్నతి మార్గాల ఏర్పాటు తదితర అంశాలకు కూడా ఆమోదం తెలిపింది.

## ఎడతెరిపి లేని భారీ వర్షం



-మొదటిపేజీ తరువాయి

రైల్వేస్టేషన్, బస్టాండ్, శ్యామలా సెంటర్, హైటెక్ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో రహదారులపై భారీగా వరద నీరు నిలిచిపోయింది. రోడ్లన్నీ చెరువులను తలపిస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు నీటిలో ప్రయాణించలేక తీవ్ర అవస్థలు పడ్డారు. జిల్లాలోని గోపాలపురం మండలంలో అత్యధికంగా 89 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డైంది. దేవరపల్లి మండలంలో 75.2, నల్లజర్లలో 69, అనపర్తిలో 65.6 మిల్లీమీటర్ల వాన కురిసింది. సీతానగరం, కడియం, చాగల్లు మండలాల్లో 55 మి.మీకి పైగా వర్షం పడింది. రాయవరం, రాజమహేంద్రవరం రూరల్, రంగంపేటలో 50 మి.మీ పైగా వర్షపాతం నమోదైంది. నిడదవోలు, కపిలేశ్వరపురం, పెరవళి, మండపేట, ఉండ్రాజవరం, రాజానగరం, కోరుకొండ మండలాల్లో 36 మి.మీ వర్షం కురిసింది. తాళ్లపూడి, గోకవరం, కొవ్వూరు, బిక్కవోలులో మోస్తరు వర్షం పడుతోంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురంతో సహా జిల్లా వ్యాప్తంగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి.

**పర్యాటకులకు నో ఎంట్రీ**

పోలవరం జిల్లాలోనూ పలు చోట్ల వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాల దృష్ట్యా పొల్లూరు సహా జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాల్లో జలపాతాలు ఉప్పొంగుతున్నాయి. పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఆయా జలపాతాలు, పర్యాటక ప్రాంతాలకు సందర్శకులను అనుమతించడం లేదు.

**24 గంటలూ కంట్రోల్ రూమ్**

రానున్న మూడు రోజుల పాటు రంపచోడవరం డివిజన్ పరిధిలో భారీ వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కార్యాలయంలో 24 గంటలూ అందుబాటులో ఉండేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు సిబ్బందికి షిఫ్ట్‌ల వారీగా విధులు కేటాయించారు. వర్షాలు, వరదలు, పిడుగులు లేదా ఇతర అత్యవసర పరిస్థితులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు టోల్‌ఫ్రీ నెంబర్ 1800 425 2531 కు ఫోన్ చేసి తెలియజేయాలని అధికారులు సూచించారు.

# కన్నీటి వీడ్కోలు.. సోమేపల్లిలో విషాదం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల అకాల మృతి.. కన్నీరుమున్నీరైన కుటుంబాలు

పార్థివదేహాలకు నివాళులర్పించిన ఎమ్మెల్యే "తాటిపర్తి చంద్రశేఖర్"

**త్రిపురాంతకం : సెప్టెంబర్ 24(మీ వార్త జిల్లా ప్రతినిధి)** ఊహించని రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. చిన్న వయసులోనే ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడంతో త్రిపురాంతకం మండలం సోమేపల్లి గ్రామం కన్నీటిసంద్రంగా మారింది. నిన్నటి వరకు తమ మధ్య నవ్వుతూ, తిరుగుతూ కనిపించిన యువకులు ఇక లేరన్న చేదు నిజాన్ని జీర్ణించుకోలేక కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు అక్కడికి చేరుకున్న ప్రతి ఒక్కరి హృదయాన్ని కలచివేశాయి. భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న కుటుంబాలకు ఈ అకాల మరణాలు తీరని లోటును మిగిల్చాయి. ఈ విషాద సమయంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మృతుల పార్థివదేహాలను సందర్శించి నివాళులర్పించారు. పూలమాలలు వేసి





ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే చంద్రశేఖర్ వారి బాధను అడిగి తెలుసుకున్నారు. కన్నబిడ్డలను కోల్పోయిన కుటుంబ సభ్యులను ఓదార్చుతూ, ఈ కష్టకాలంలో కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

**మాటలకు అందని విషాదం..**

ఒక్క క్షణంలో జరిగిన ప్రమాదం రెండు కుటుంబాల భవిష్యత్తును చీకటిమయం చేసింది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వారు తిరిగి వస్తారనే ఆశతో ఎదురుచూసిన కుటుంబాలకు చివరకు పార్థివదేహాల రూపంలో దర్శనమివ్వడం విషాదాన్ని మరింత తీవ్రం చేసింది. గ్రామంలో ఎక్కడ చూసినా కన్నీటి దృశ్యాలే కనిపించాయి. యువకుల అకాల మరణంతో సోమేపల్లి గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ తీరని దుఃఖాన్ని భరించే శక్తిని ప్రసాదించాలని గ్రామస్తులు ప్రార్థించారు.

# వర్షాన్ని సైతం లెక్కచేయని భక్తి సందడి.

స్థానిక సర్పంచ్ పెరికే నాగేశ్వరావు నేతృత్వంలో.

తల్లాడలో ఘనంగా కలశం ఊరేగింపు.

ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, పిల్లలు.

**తల్లాడ మీ వార్త ప్రతినిధి.23.9.2026**
వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా తల్లాడ పట్టణంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరికే నాగేశ్వరరావు నేతృత్వంలో కలశం ఊరేగింపు కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలు, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. శ్రీనగర్ కాలనీ వాసులు, వ్యాపారస్తులు, వర్తకులు,మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఊరేగింపును విజయవంతం చేశారు.
జోరువానలోనూ జోష్ తగ్గలేదు,
ఊరేగింపు కొనసాగుతున్న సమయంలో జోరుగా వర్షం కురిసినా భక్తులు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ఉత్సాహంగా ముందుకు సాగారు. కలశాలతో డ్యాన్స్ చేస్తూ,భక్తి గీతాలకు అనుగుణంగా సందడి చేస్తూ ప్రేక్షకులను అలరించారు.వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహిళలు,పిల్లలు, యువత ఉత్సాహంగా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.





సర్పంచ్ పెరికే నాగేశ్వరరావు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, వ్యాపారులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావడంతో తల్లాడ పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.భక్తి, ఉత్సాహం,ఐక్యతకు ప్రతీకగా ఊరేగింపు భక్తి శ్రద్ధలతో సాగిన కలశం ఊరేగింపు ఆద్యంతం ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరికే నాగేశ్వరరావు,శ్రీనగర్ గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు గురివిందల సుధా నాయుడు,కోడూరి రాము,ఆపతి రామారావు,చిహెచ్. కృష్ణమూర్తి,పసుమర్తి శ్రీనివాసరావు,యూత్ కమిటీ సభ్యులు ప సుమర్తి హరీష్,పెరికే మణిశంకర్,తొండపు తరుణ్,త్రివేణ్, గౌతమ్ వేమిశెట్టి, సోనూ ఎస్.కె.,నవీన్ కొమ్మినేని,మనోజ్ కుమార్ గుర్రం, ఉదయ్,నిమ్మల మనోజ్,హేమంత్, సూర్య,వరుణ్, సాత్విక్ తదితరులు పాల్గొననున్నారు.

# తుఫాను నేపథ్యంలో గణేష్ నిమజ్జనాలను జాగ్రత్తగా,సురక్షితంగా నిర్వహించాలి...

చీకటి పడకముందే గణేష్ నిమజ్జనలు పూర్తి చేసుకోవాలి...

పోలవరం ఎస్ఐ పి. అప్పారావు

**పోలవరం,మీ వార్త సెప్టెంబర్ 23**
తుఫాను ప్రభావంతో ఏలూరు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాల్లో ప్రజలు, భక్తులు మరియు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ వై. ప్రసాద్ రావు మరియు పోలవరం డీఎస్పీ కె. జయకృష్ణ సూచనల మేరకు, పోలవరం సీఐ బి. కృష్ణకుమార్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ప్రజలకు పలు ముందస్తు జాగ్రత్త సూచనలు చేశారు.ఈ సందర్భంగా పోలవరం ఎస్ఐ పి. అప్పారావు మాట్లాడుతూ, పోలవరం మండలంలోని వివిధ ప్రాంతాల్లో గణేష్ నిమజ్జనాలు నిర్వహించే భక్తులు మరియు ఉత్సవ కమిటీ సభ్యులు చీకటి పడకముందే నిమజ్జన కార్యక్రమాలను పూర్తి చేసుకోవాలని సూచించారు.తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నందున నదులు, కాలువలు, చెరువులు మరియు వాగుల్లో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, అందువల్ల నిమజ్జన సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గణేష్ నిమజ్జనాలను వీలైనంత వరకు పగటి సమయంలోనే పూర్తి చేసుకోవాలి.రాత్రి సమయంలో నిమజ్జనం చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున చీకటి పడిన తర్వాత నిమజ్జనాలకు వెళ్లవద్దు,నిమజ్జనం సమయంలో పిల్లలు, మహిళలు మరియు వృద్ధులను ప్రమాదకరమైన నీటి ప్రాంతాలకు తీసుకెళ్లకూడదు.కాలువలు, చెరువులు, వాగులు మరియు ఇతర నీటి వనరుల వద్ద భద్రతా జాగ్రత్తలు పాటించాలి.మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనకూడదు.పోలీసు అధికారులు మరియు సిబ్బంది ఇచ్చే సూచనలు, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. వాహనదారులు మరియు భక్తులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రయాణించాలి.అదేవిధంగా వింజరం, గుంజవరం, రేపల్లెవాడ మరియు పరిసర గ్రామాల ప్రజలు తుఫాను కారణంగా వాగులు పొంగి రోడ్లు, వంతెనలపై నీరు ప్రవహించే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు.వంతెనలపై నీరు ప్రవహిస్తున్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలతో లేదా నడిచి వాగులు దాటేందుకు ప్రయత్నించకూడదని, నీటి ప్రవాహం తగ్గే వరకు వేచి ఉండాలని తెలిపారు. ప్రాణాలను పణంగా పెట్టి ప్రమాదకర ప్రాంతాల్లో ప్రయాణించవద్దని ప్రజలకు



సూచించారు.సురక్షితమైన గణేష్ నిమజ్జనం అందరి బాధ్యత. ప్రజలు పోలీసుల సూచనలు పాటించి, తమతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా రక్షణ కల్పించే విధంగా వ్యవహరించాలి" అని పోలవరం ఎస్ఐ పి. అప్పారావు తెలిపారు.ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా సహాయం అవసరమైనప్పుడు వెంటనే సమీపంలోని పోలీసులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

## మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.21.15 లక్షల బీమా చెక్కు

కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని ఎస్పీ హర్షవర్ధన్ రాజు భరోసా

**ఒంగోలు : సెప్టెంబర్ 24(మీ వార్త జిల్లా ప్రతినిధి)**రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోలీసు కానిస్టేబుల్ కుటుంబానికి గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ (జీపీఏఐ) కింద రూ.21.15 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. బుధవారం ప్రకాశం జిల్లా పోలీసు క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ "వి.హర్షవర్ధన్ రాజు" ఐపీఎస్., మృత కానిస్టేబుల్ సతీమణి కె.భారతికి బీమా చెక్కును అందజేశారు. ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన మరియదాసు (ఏఆర్ పీసీ-3891, 35) ఈ ఏడాది జూలై 12న ఉదయం ఒంగోలు టౌన్‌లోని పద్మ టవర్స్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన కానిస్టేబుల్ దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల చదువులు, కుటుంబ పరిస్థితులపై ఆరా తీశారు. బీమా ద్వారా అందుతున్న రూ.21.15 లక్షల ఆర్థిక సహాయం కుటుంబానికి కొంతమేర ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఆయన అన్నారు. పోలీసు శాఖ పరంగా మృతిచెందిన సిబ్బందికి అందాల్సిన ఇతర ప్రయోజనాలను కూడా త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. మృత పోలీసు సిబ్బంది కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కుటుంబ సభ్యులకు ఏదైనా సమస్య ఎదురైతే నేరుగా తనను సంప్రదించవచ్చని భరోసా కల్పించారు. కార్యక్రమంలో డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.




## తుపాన్ ప్రభావంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి




**పోలవరం మీ వార్త సెప్టెంబర్ 23**
పోలవరం తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురుగాలులు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్, పోలవరం నియోజకవర్గ టీడీపీ నాయకురాలు కొవ్వాసు జగదీశ్వరి సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, చెట్లు, విద్యుత్ స్తంభాలు, పాత భవనాలకు దూరంగా ఉండాలని కోరారు. రైతులు పంట పొలాల్లో జాగ్రత్తలు పాటించాలని, తెగిపడిన విద్యుత్ వైర్లను తాకకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు, వంకలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అధికారులు జారీ చేసే సూచనలు, అధికారిక వాతావరణ సమాచారాన్ని మాత్రమే ప్రజలు విశ్వసించాలని కోరారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి అధికార యంత్రాంగానికి సహకరించాలని జగదీశ్వరి విజ్ఞప్తి చేశారు.

## జాగ్రత్తగా సురక్షితంగా చీకటి పడక ముందే గణేష్ నిమజ్జనాలు నిర్వహించాలి.--- ఎస్. ఐ. వెంకటేశ్వరరావు.



**రౌతులపూడి సెప్టెంబరు 23: ( మీ వార్త న్యూస్ ప్రతినిధి )** గణేష్ నిమజ్జనాలను నిర్వహించే భక్తులు మరియు కమిటీ సభ్యులు జాగ్రత్తగా సురక్షితమైనటువంటి వాతావరణంలో చీకటి పడక ముందే నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించుకోవాలని రౌతులపూడి పోలీస్ అధికారి జి వెంకటేశ్వరరావు భక్తులకు సూచించారు. తుఫాను తీవ్రవాయుగుండంగా ఏర్పడి భారీ నుండి అతి భారీ వర్షాలు పడుతున్న కారణంగా ముందస్తు జాగ్రత్తగా చర్యలలో భాగంగా ఆయన భక్తులకు తగు సూచనలు సలహాలు చేశారు. నిమజ్జనంలో మహిళలను చిన్నారులను కాలువల వద్దకు చెరువుల వద్దకు తీసుకెళ్లకూడదని ఆయన తెలియజేశారు. సురక్షిత నిమజ్జనం అందరి బాధ్యతని పోలీసుల సలహాలు సూచనలను భక్తులు పాటించాలన్నారు.

## జీలుగుమిల్లిలో లంబోదరునికి ఘనంగా వీడ్కోలు.



**జీలుగుమిల్లి.. (మీ వార్త ప్రతినిధి) (**
జీలుగుమిల్లి మండల కేంద్రంలో వినాయక చవితి సందర్భంగా కాపుల బజార్లో విగ్నేశ్వరునికి తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 10వ. రోజు బుధవారం, స్వామివారికి అత్యంత ప్రీతికరమైన మహా లడ్డు ప్రసాదాన్ని వేలం పాటలో 42 వేలకు, ఆరుగురు సభ్యుల బృందం లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్నారు, గత 20 సంవత్సరాలుగా కాపుల బజార్లో వినాయక చవితిని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, ప్రతి ఏట భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు, బుధవారం గ్రామ పురవీధుల్లో వినాయకుని ఊరేగింపు డీజే లతో కోలాటాలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో చాట్రాతి భవాని శేఖర్. కోలాధర్మరాజు, గంగుల రమేష్, మురారి బాలాజీ, కోలా లక్ష్మణ్, మురారి వెంకట్, గంటా సాయి, మై రెడ్డి రాజు, రూప పెద్ద సత్యనారాయణ, రూపా చిన్న సత్యనారాయణ, పేరాబత్తుల వెంకటనారాయణ, బుర జగదీష్, బేరెడ్డిసందీప్ కమిటీ సభ్యులు తదితర మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## భక్తి శ్రద్ధలతో శ్రీనగర్ లో వినాయకునికి కుంకుమార్చన .

వైభవంగా గణనాథుని పూజా కార్యక్రమాలు.

పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు దగ్గుల శ్రీనివాసరెడ్డి,జివిఆర్.



**తల్లాడ మీ వార్త ప్రతినిధి.23.9.2026**
తల్లాడ మండల కేంద్రం శ్రీనగర్ లో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమం భక్తుల ఆధ్యాత్మిక సందడితో ఘనంగా జరిగింది. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు కుంకుమార్చనలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.
భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా గణేష్ ఉత్సవాలు శ్రీనగర్ కాలనీలో గణేష్ ఉత్సవాలను నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుండటంతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.పెద్ద సంఖ్యలో భక్తులు మండపాన్ని సందర్శించి గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ జోనల్ సభ్యులు దగ్గుల శ్రీనివాసరెడ్డి, ఆ పార్టీ తల్లాడ పట్టణ అధ్యక్షులు జివిఆర్,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సత్తెనపల్లి నరేష్,యువ నాయకులు కటికి శ్రీకాంత్, నరసింహారావు, పరిసర ప్రాంత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు

ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ వారు ఏలూరు డీఎస్పీ శ్రీ డి. శ్రావణ్ కుమార్ గారి ఆదేశాల మేరకు, వినాయక చవితి నిమజ్జనోత్సవం సందర్భంగా ఏలూరు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీ కె. రామకృష్ణ, ఎస్.ఐ. సుధాకర్, రూరల్ ఎస్.ఐ. వి. వెంకటేశ్వర రావు మరియు సిబ్బంది తీసుకున్న ముందస్తు చర్యలు ఏలూరులో ప్రశాంతంగా వినాయక విగ్రహాల నిమజ్జనం పోలీసు అధికారుల ముందస్తు చర్యలు ఏలూరు డీఎస్పీ శ్రీ డి. శ్రావణ్ కుమార్ గారి పర్యవేక్షణలో, వినాయక చవితి ఆఖరి రోజు నిమజ్జన వేడుకలు ఏలూరులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్యంత ప్రశాంతంగా జరిగేలా పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లలో భాగంగా ఏలూరు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీ కె. రామకృష్ణ, ఎస్.ఐ. సుధాకర్ రూరల్ ఎస్.ఐ. వి. వెంకటేశ్వర రావు తదితర పోలీసు సిబ్బంది సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టారు.



సమస్యాత్మక ప్రాంతాల్లో గస్తీ నిర్వహించి, ట్రాఫిక్ మళ్లింపులు చేస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు.

వాగులు, కాలువలు మరియు నిమజ్జన ప్రాంతాల్లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నిమజ్జన వేడుకలు జరిగే రద్దీ ప్రాంతాలు మరియు నీటి వనరుల వద్ద తల్లి దండ్రులు తమ పిల్లలను ఎట్టి పరిస్థితులలోనూ ఒంటరిగా వదలకూడదు, వారి చెయ్యి పట్టుకుని దగ్గరే ఉంచుకోవాలి.

వాగులు, కాలువలు మరియు నదుల వద్ద నీటి ప్రవాహం మరియు లోతు ఎక్కువగా ఉండే ప్రాంతాలకు ప్రజలు, ముఖ్యంగా యువకులు దూరంగా ఉండాలి.

పోలీసు శాఖ వారు ఏర్పాటు చేసిన బారికేడ్లు మరియు హెచ్చరిక బోర్లను దాటి నీటిలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకొన్నారు.

ఈత రానటువంటి వారు సరదాగానైనా కాలువలు లేదా నీటి కుంటలోకి దిగకుండా కఠినమైన స్వీయ నియంత్రణ పాటించాలి అని

విగ్రహాల ఊరేగింపులు మరియు నిమజ్జన సమయంలో అధిక రద్దీ ఏర్పడుతుంది కాబట్టి, తోపులాటలకు గురికాకుండా సంయమనం పాటించాలి.

నిమజ్జన ఘాట్ల వద్ద భద్రత కోసం విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు మరియు వాలంటీర్ల సూచనలను తూచా తప్పకుండా పాటించాలి.

నిమజ్జన వేడుకల్లో పాల్గొనేవారు లేదా వాహనాలు నడిపేవారు మద్యం సేవించి నీటి వద్దకు రావడం అత్యంత ప్రమాదకరం.

భారీ విగ్రహాల ఊరేగింపు సమయంలో వేలాడుతున్న విద్యుత్ తీగల పట్ల ఆపరేటర్లు మరియు నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే లేదా ఎవరైనా నీటిలో మునిగిపోతున్నట్లు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా రెస్క్యూ సిబ్బందికి సమాచారం అందించాలి.

ఉత్సవ కమిటీ సభ్యులు మరియు ప్రజలు పోలీసు యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరించి, నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగిసేలా సహకరించాలి అని



ప్రజల భద్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఏలూరు పోలీసులు చేపట్టిన ఈ ముందస్తు చర్యలపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# మానవ రూపంలో తిరుగాడే దైవం మన తోట ప్రేమ్ కు చిరు సత్కారం

**మచిలీపట్నం సెప్టెంబర్23 (మీ వార్త ప్రతినిధి)**
ప్రముఖ న్యాయవాది శ్రీలంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు సమాచారం మేరకు ఆదివారం అర్ధరాత్రి ఈ నెల 20 తేదీన,విషమ పరిస్థితుల్లో ఉన్న బందరు మండలం పోలాట తిప్ప గ్రామానికి చెందిన జనసేననాయకులుమోకారవి తీవ్రమైన గుండె నొప్పితో బాధపడుతూ డాక్టర్ తోట ప్రేమ వద్దకు రావడం జరిగిందని తెలిపారు .విషమ పరిస్థితిని తెలుసుకున్న డాక్టర్ ప్రేమ్ మొదటి గోల్డెన్ అవర్ లో అత్యవసర వైద్య సహాయం ఉచితంగా అందించి ప్రాణం నిలిపి డాక్టర్ వృత్తికే వన్నె తెచ్చారని బాలాజీ పేర్కొన్నారు. చమచిలీపట్నం ప్రజల గుండెచప్పుడుగా డాక్టర్‌లితోట ప్రేమ్ కీర్తి గడించారనిలిఅభినందించారు

చఅత్యవసర పరిస్థితుల్లో మచిలీపట్నంలో గుండె వైద్య నిపుణులు లేని లోటును అన్నివేళలా అందుబాటులో ఉంటూ దైవం మానవ రూపేనా అన్న విధంగా డాక్టర్ తోట ప్రేమ్ ప్రజల అభిమానం ఆశీస్సులు అభినందనలు పొందుతున్నారని డాక్టర్ తోట ప్రేమ్ కార్డియాలజిస్ట్ గాఎంత పేరు ప్రఖ్యాతలు సంపాదించినప్పటికీ రోగులకు



కుటుంబసభ్యుడిగా ప్రేమ్ ప్రవర్తించే తీరు రోగులలో కొండంత ధైర్యాన్ని నింపినేనున్నాను అనే భరోసాని ఇచ్చే వీరి వ్యక్తిత్వానికి మాటలు చాలవని పేర్కొన్నారు. తోట ప్రేమ్ ను ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాజీ కార్పొరేటర్ శ్రీమతి వనజ లంకిశెట్టి, సంఘ సేవకురాలు శ్రీమతి వరలక్ష్మి జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు డాక్టర్ తోట ప్రేమ్ ను శాలువాతో సత్కరించి ప్రాణదాతకు అభినందనలు తెలియజేశారు.ఫోన్ సమాచారంతో జన సైనికుడైన మోకారవి కి నగర అధ్యక్షుడుగడ్డం రాజు మరియు జన సైనికులు అండగా నిలబడి డాక్టర్ తోట ప్రేమ్ సూచన మేరకు శ్రీ బండి రామకృష్ణ ఆదేశాలతో విజయవాడ అనూస్ హాస్పిటల్ తరలించి మోకా రవికి అండగా నిలబడి నాయకుడిగా కాకుండా సేవకుడిగా తన బాధ్యతను నెరవేర్చడం గడ్డం రాజు మానవత్వానికి మచ్చుతునకని బాలాజీ అన్నారు.ఈ కార్యక్రమంలోశ్రీ లంకిశెట్టి బాలాజీ,మాజీ కార్పొరేటర్ ఉప ప్రతిపక్ష నాయకురాలు శ్రీమతిలంకి శెట్టివనజ, సమాజ సేవకురాలు శ్రీమతి వరలక్ష్మి జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు పాల్గొన్నారు జనసేన పార్టీమచిలీపట్నం నగర అధ్యక్షుడు,గడ్డంరాజు తెలిపారు.

# 32 కేసులు ముడ్డి కిందా పెట్టుకుని, 16 నేలలు జైల్లో చిప్పకూడుతిన్నవారి పై ఫైర్

**మాజీ జడ్పీటీసీ మెంబరు.... పిన్నెంటి రత్తయ్య**

**పెదన సెప్టెంబర్ 22(మీ వార్త ప్రతినిధి)** కన్న తల్లిని, రక్తం పంచుకుని పుట్టిన చెల్లెల్ని ఛీ రెడ్డి, పంచ్ ప్రభాకరం, బోరు గడ్డా లాంటి సన్నాసులతో తిట్టించిన వాడు..కన్న తండ్రి శవం రాకముందే సీఎం సిటు కోసం సంతకాలు సేకరణ చేసిన వాడు,తన అక్రమ కేసుల్లో నుంచి తప్పించుకోవడానికి, పావురాల గుట్టలో పోయిన తండ్రి పేరును సిబిఐ ఛార్జ్ సిట్ లో చేర్పించిన వాడు,వాడు క్రమశిక్షణ నేర్పాడు, మీరు నేర్చుకున్నారు అంటే ఎవరు నమ్ముతారు మాజీ జడ్పీటీసీ మెంబరు.... పిన్నెంటి రత్తయ్య అధికారంలో లేనప్పుడు అమరావతిలో యిల్లు కట్టుకుంటున్నాను అన్నాడు, అధికారం లోకి వచ్చాక తూచ్ అమరావతి రాజధాని కాదు, మూడు రాజధానులు మా విధానం అన్నాడు. ఇటువంటి సన్నాసికా మనం అధికారం యిచ్చాం అని ప్రజలు 151 లో నుంచి మధ్యలో 5 పీకేసాక మావిగన్ మా విధానం అని ఒకరోజు, ఎ విజయవాడ ను రాజధాని ఎందుకు చెయ్యకూడదు అని మరుసటి రోజు మాట్లాడే ప్రజా ధనం దోచుకుతిన్న ఖైదీ నెంబర్ 6093 మీకు సంస్కారం నేర్పడా అని కృత్తివెన్ను మండల టీడీపీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య అన్నారు. సోషల్ మీడియాలో పిచ్చి కామెంట్స్ పెడుతున్న పెటియం కుక్కల గురించి అయన మీడియాతో బుధవారం మాట్లాడుతూ ఒక సామాన్య ఉద్యోగి సైతం తన జీతం సొమ్ముతో తన కుటుంబ అవసరాలు తీర్చుకుంటాడు, కానీ ముఖ్యమంత్రిగా జీతం మింగుతూ ఎగ్ పప్పుల రూపంలో కోట్లాది రూపాయలు ప్రజాధనం, తాడేపల్లి కొంపలో ఎలుకలు పంది కొక్కులు దూరాయని కోట్ల రూపాయలు ప్రజాధనం తిన్న ఘనుడు 11 మోహన్ రెడ్డి, అటువంటి వాడు మీకు సభ్యత, సంస్కారం నేర్పాడు అని చెప్పడానికి మీకు కనీసం సంస్కారం అడ్డు రావడం లేదా పేద ప్రజల బియ్యం దొంగ అదే బందరు బోడిలింగం నాలుగవసారి ముఖ్యమంత్రి గా చేస్తున్న మా నాయకుడి చంద్రబాబు గారిని అమ్మ మొగుడు సొమ్ము ఇచ్చాడా అనే సంస్కారం మీకు మీ నాయకుడు నేర్పించాడా అని టీడీపీ కృత్తివెన్ను మండల సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య అన్నారు. మీరు ప్రభుత్వం లో ఉండగా పడతడిక నుంచి టిప్పర్లు పెట్టి మట్టి మాపియా జరిగింది కదా బీమవరం, నరసాపురం నియోజకవర్గంలకు ఎటువంటి అనుమతులు లేకుండా మీ ఇంటి సమీపంలో వందలాది ఎకరాలు చెరువులు తవ్వలేదా, లేదా గరిసపూడి గ్రామంలో తనెల్ వంతెన దగ్గర శ్రీనివాస రెడ్డిని అడ్డం పెట్టుకుని మీ రోగి రమేష్ వందలాది ఎకరాల ప్రభుత్వం మడ భూములు చెరువులు తవ్వలేదా, ఇంతేరు గ్రామంలో సముద్రంను అనుకుని ఉన్న సి ల్యాండ్ లో మీ రోగి రమేష్ శ్రీనివాస రెడ్డి ద్వారా మడ అడవులు మింగి




చెరువులు తవ్వలేదా జడ్పీటీసీ మెంబెర్ దమ్ముంటే బైబిల్ సాక్షిగా ఇవి అబద్దాలు అని చెప్పగలరా కుమారి , యిప్పుడు పేద ప్రజల ఇళ్లకు బెస్ మెంట్ కోసం మట్టి తోలుతుంటే అది మట్టి మాపియా అంటున్నారు కదా జడ్పీటీసీ మెంబరు మరి మీ రోగి రమేష్ కృత్తివెన్ను మండలంలో చెరువుల తవ్వాకాలకు ఎకరానికి మొదట్లో పదివేలు, ట్రాన్సపార్మర్ కూ లక్ష, మంత్రి అయ్యాక ఎకరానికి 25 వేలు ట్రాన్సపార్వర్ కి 2 లక్షలు, మట్టి తొలకాలకు ఎకరానికి లక్షలు వేలు మింగలేదా, కృత్తివెన్ను మెగా వాటర్ స్కీమ్ నుంచి చేపలు పట్టుకుని అమ్ముకోలేదా, వార్తలు రాసిన విలేకరులను బెదిరించలేదా ప్రతి పనికి ఆఖరికి వాలంటీర్ పోస్టుకు ఇంత, అంగన్వాడీ పోస్టుకు ఇంత, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సేల్స్ మాన్ కి ఇంత, సూపర్ వైజర్ కి ఇంత అని, సచివాలయం ఉద్యోగస్తుల పోస్టులకు ఇంత అని ప్రజల నుంచి వసూలు చెయ్యలేదా యిది నిజం కాదు అని బైబిల్ మీదా ప్రమాణం చేయగలవా, అప్పుడు మీరు జడ్పీటీసీ , యిక్కడ ఇంకోకడు గురించి కూడా ప్రస్తవించాలి మాజీ ఏం ఎల్ ఎ మా తాత అని చెప్పుకోవడం తప్పితే మీ గ్రామానికి, మన మండలానికి నువ్వేం చేసావ్, కేవలం ఒకే ఇంటి పేరు ఉంటే సరిపోదు, ఏపీ ఆర్ టి సి సంస్థకు జోనల్ చైర్మన్ గా ఉండి సొంత మండలానికి ఏమి చెయ్యని నువ్వు నీ పని నువ్వు చేసుకో పెద్ద పెద్ద మాటలు అంటున్నావు ఎ మేము మాట్లాడు కూడదా అవే తగ్గించుకుటే అందరికి మంచిది బియ్యం దొంగ ఇంటికి ముట్టడికి వెళ్ళితే నన్ను, పసుపు సైన్యాన్ని ఆపుతావా, వాపును చూసి బలుపు అనుకోకు, మా నాయకుడు కాగిత కృష్ణా ప్రసాద్ జోలికి వస్తే మాకు గల్లీ నాయకుడు అయినా నువ్వు అయినా జిల్లా నాయకుడు అయిన బందర్ బోడి లింగం అయిన ఒకటే, అస్సలు మీ గొడ్డలి పార్టీ అధ్యక్షుడు అయిన మా కాగిత కృష్ణా ప్రసాద్ జోలికి వస్తే తాడేపల్లి కొంపను కూడా ముట్టడిస్తాం అని కృత్తివెన్ను మండల టీడీపీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య అన్నారు.......

# మున్సిపల్ కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ




**జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్ 23 ( మీ వార్త ప్రతినిధి ):** పట్టణం లో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశు ధ్య కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య సిబ్బందికి రెయిన్‌కోట్లు మరియు గ్లౌస్ లు మాస్క్ లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ కె. వెంకట రమణ చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు అందజేశారు. వర్షాలు కురుస్తున్న సమయంలో కూడా పారిశుధ్య నిర్వహణ, రోడ్ల శుభ్రత, డ్రైనేజీల పర్యవేక్షణ వంటి విధులను కార్మికులు నిరంతరం నిర్వహిస్తున్నారని కమిషనర్ తెలిపారు. వర్షాల సమయంలో కార్మికులు ఆరోగ్యం మరియు భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విధులు నిర్వహించే సమయంలో తప్పనిసరిగా రక్షణ పరికరాలను వినియోగించాలని కమిషనర్ సూచించారు. మున్సిపల్ కార్మికుల సేవలను అభినందిస్తూ, వారి భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ గారు, శానిటేషన్ సెక్రెటరీలు, సిబ్బంది మరియు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.




# బంటుమిల్లి మండలంప్రజాపరిషత్ పెద్ద తుమ్మిడి త్రాగునీరు 13 లక్షల 50 వేలు మంజూరు

**బంటుమిల్లి సెప్టెంబర్ 23(మీ వార్త ప్రతినిధి)**
బంటుమిల్లి మండలం బంటుమిల్లి గ్రామపంచాయతీ పరిధిలో త్రాగునీరు విషయంలో నాణ్యత లేకపోవడం వలన మండల ప్రజాపరిషత్ దృష్టికి రావడం వల్ల తక్షణమే 13 లక్షల 50 వేలు మంజూరు చేయటం జరిగింది పనులు కూడా వెంటనే మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఇప్పటికే పెద్ద తుమ్మిడి త్రాగునీరు కోసం పది లక్షల రూపాయలు మండల ప్రజా పరిషత్ నిధుల నుండి ఇవ్వడం జరిగింది .పనులు కూడా చురుగ్గా జరుగుచున్నాయి నాకు సహకరించిన బంటుమిల్లి మండల ప్రజానీకానికి నమస్కారాలు తెలియజేస్తూ రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన ప్రజా సమస్యల పైన పోరాటానికి సిద్ధమేనని తెలియజేస్తూ నాకు అవకాశం ఇచ్చిన మీ అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.



# గిరిజన పర్యాటక ప్రాంతాలు మూసివేత

**చింతూరు,సెప్టెంబర్ 23,మీ వార్త ప్రతినిధి**
:తుఫాను కారణంగా భారీ వర్షాలు కురవడంతో వాగులు,వంకలు,నదులు పొంగి ప్రవహిస్తున్నాయని, కొండ చరియలు విరిగి పడిపోయే విరిగిపడవచ్చునని అందువల్ల చింతూరు పోలీస్ సర్కిల్లోని మోతుగూడెం,పోల్లూరు, ఫోర్ బే క్యాంపు,వాటర్ ఫాల్స్,డొంకరాయి తదితర పర్యాటక ప్రాంతా లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు చింతూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గోపాలకృష్ణ మీ వార్త ప్రకటనలో తెలిపారు



# క్రీడా మౌలిక వసతులపై కీలక నిర్ణయాలు

శాప్ 90వ బోర్డు సమావేశం

శాప్

చైర్మన్ రవి నాయుడు



**పోలవరం మీ వార్త సెప్టెంబర్ 23** అమరావతి శాప్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ రవి నాయుడు అధ్యక్షతన 90వ బోర్డు సమావేశం నిర్వహించారు.
క్రీడా మౌలిక వసతుల అభివృద్ధిపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు.
క్రీడా సంఘాలకు సంబంధించిన పలు అంశాలను బోర్డు సభ్యులు సమీక్షించారు.
క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వివిధ క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కోచ్‌లకు సంబంధించిన పలు అంశాలను కూడా సమావేశంలో చర్చించారు. క్రీడా రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కార్యాచరణపై సభ్యులు చర్చించారు. సమావేశంలో శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పాల్గొన్నారు. ఎండీ భరణి ఐఎఫ్ఎస్‌తో పాటు ఇతర శాప్ బోర్డు సభ్యులు హాజరయ్యారు. క్రీడా రంగ అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు.

# ప్రజాప్రతినిధుల సేవలు ఎనలేనివి ...

:ఎమ్మెల్యే అంజిబాబు

**భీమవరం : సెప్టెంబర్ 23:** మీ వార్త ప్రతినిధి:
ప్రజల చేత ఎన్నుకోబడిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సేవలు ఎనలేనివని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులను బుధవారం సత్కరించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగిసిందని, ఈనెల 24తో ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీకాలం ముగియనుందన్నారు. మండలంలోని గ్రామాల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రజా ప్రతినిధులు పని చేయాలని సూచించారు. అనంతరం సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.



# అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు..

**కొయ్యలగూడెం. (మీ వార్త ప్రతినిధి )**ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ శాఖల పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై అధికారులతో ఎమ్మెల్యే బాలరాజు సమగ్రంగా చర్చించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ... మండల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను అధికారులు సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, వ్యవసాయం, విద్య, వైద్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు



అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేస్తేనే



అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా పూర్తవుతాయని ఎమ్మెల్యే బాలరాజు తెలిపారు. . ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు అధికారులు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో ఎంపీడీవో, ఎమ్మార్వో, వ్యవసాయ శాఖ అధికారి, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు..

# పదవీకాలం ముగిసిన వేళ ఎంపీపీ ఎంపీటీసీలకు సన్మానం

## ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

**పోలవరం మీ వార్త సెప్టెంబరు 23**
రాష్ట్రవ్యాప్తంగా ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం బుధవారంతో ముగిసింది.
ఈ సందర్భంగా కన్నాపురం అడ్డా రోడ్డు సమీపంలోని ఎస్ఎస్ఎస్ కళ్యాణ మండపంలో అభినందన సభ నిర్వహించారు.ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీలను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు.
గత ఐదేళ్లుగా మండల అభివృద్ధికి ఎంపీటీసీలు అందించిన సేవలను వక్తలు కొనియాడారు.
ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి వారు చేసిన కృషిని ప్రశంసించారు.
అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరయ్యారు. ఆయన ఎంపీటీసీలను అభినందించి, ఐదేళ్లపాటు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.
పదవీకాలం ముగిసినప్పటికీ ప్రజా సేవ కొనసాగించాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో సుంకర వెంకటరెడ్డి మిడియం సింగరాజు యామల శ్రీదేవి ఎంపిటిసి సభ్యులు వలవల వరలక్ష్మి అరగంటి పెంటమ్మ కోఆప్షన్





మెంబర్ మొహ్మద్ అబ్దుల్ సలాం మాడే ఆనంద్ రావు సోమరౌత్ అనిత కుమారి కాశి ధనలక్ష్మి బుగ్గ మురళీ కృష్ణ కుంజం చిట్టెమ్మ దాపర్తి మోహనరావు ఆకుల వరలక్ష్మి దేగపాటి హరిరామకృష్ణ పోలవరం మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు జెట్టి గురునాథం పోలవరం నియోజకవర్గ పరిశీలకులు కనుమూరి శివాజీ రాజు భీమవరం నియోజకవర్గం మంతెన సోమరాజు జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి మధు ఎంపీటీసీలు సర్పంచులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఎంపీటీసీలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు ఆధార్ బయోమెట్రిక్ నవీకరణ తప్పనిసరి

**భీమవరం, సెప్టెంబర్ 23: మీ వార్త ప్రతినిధి:** జిల్లాలోని పాఠశాలలు మరియు కాలేజీలలో చదువుతున్న 5 నుండి 7 సంవత్సరాల మరియు 15 నుండి 17 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులందరికీ మరియు 0నుండి 5 సంవత్సరముల పిల్లలకు ఆధార్ బయోమెట్రిక్ నవీకరణ ప్రక్రియను నూరు శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో విద్యాశాఖ, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, మరియు ఆధార్ ప్రాధికార సంస్థ అధికారులతో కలెక్టర్ ఉన్నత స్థాయి కమిటీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆధార్ కార్డులో బయోమెట్రిక్ వివరాలను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు తల్లికి వందనం, మరియు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిచి పోకుండా ఉండటానికి ఈ అప్‌డేట్ అత్యంత అవసరం ,భవిష్యత్తులో విద్యార్థులు రాసే బోర్డు పరీక్షలు, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలు ,మరియు కాలేజీ అడ్మిషన్ల సమయంలో ఎలాంటి బయోమెట్రిక్ ప్రామాణీకరణ సమస్యలు రాకుండా ఇది ఉపయోగపడుతుందన్నారు. పాఠశాలలు మరియు కాలేజీలలో విద్యార్థుల రోజువారీ బయోమెట్రిక్ హాజరు సజావుగా నమోదు కావడానికి ఇది తోడ్పడుతుంది అన్నారు. విద్యార్థులు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, వారి పరిధిలోని



పాఠశాలలు మరియు జూనియర్ కాలేజీల ప్రాంగణాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేయాలని అధికారులతో అన్నారు. విద్యార్థులు తమ సమీపంలోని గ్రామ మరియు వార్డు సచివాలయాలలో కూడా ఈ సేవలను ఉచితంగా పొందేలా చర్యలు తీసుకోవాలి అన్నారు. 5 నుండి 7, 15నుండి 17 సంవత్సరాల వయసు ఉన్న విద్యార్థులందరూ ఆధార్ నమోదు చేసుకునే విధంగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి హెడ్‌మాస్టర్లు, ప్రిన్సిపాల్స్ ద్వారా ప్రతి విద్యార్థి బయోమెట్రిక్ అప్‌డేట్ పూర్తయ్యేలా చూడాలని జిల్లా విద్యాశాఖా అధికారినీ ఆదేశించారు. జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల వయసుగల పిల్లలను ఏ ఒక్కరిని వదలకుండా ప్రతి ఒక్కరికి కచ్చితంగా ఆధార్ నమోదు చేయించాలని స్త్రీ శిశు సంక్షేమ అధికారికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల జనన ధృవీకరణ పత్రాలతో సమీప పాఠశాల లేదా సచివాలయ క్యాంపులకు వెళ్లి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో నూరు శాతం ఆధార్ నమోదు అయ్యేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పి. గ్లోరియా, జిల్లా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు అధికారి ఏ. వెంకటలక్ష్మి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి డి. శ్రీలక్ష్మి, జిల్లా విద్యాశాఖాధికారి ఓ వి ఎస్ అనిల్ కుమార్, డి పి ఓ వై. దోసిరెడ్డి, డిఎం అండ్ హెచ్ ఓ కార్యాలయం ఏవో డా. బాల, ఆధార్ రీజినల్ ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఏ సత్య కళ, జిల్లా ఆధార్ కోఆర్డినేటర్ సిహెచ్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఆకులమన్నాడులో ఉచిత మెగా వైద్య శిబిరం

## మాజీ సర్పంచ్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో

**గూడూరు, సెప్టెంబర్ 23:(మీ వార్త ప్రతినిధి)** కృష్ణా జిల్లా ఆకులమన్నాడులో శ్రీకర హాస్పిటల్, విజయవాడ మరియు కేర్ టు యాక్షన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈరోజు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు మరియు మందులు అందించారు. శిబిరంలో ఆర్థోపెడిక్, కార్డియాలజీ, డెర్మటాలజీ, నేత్ర వైద్యం తదితర విభాగాల్లో వైద్య సేవలు అందించారు. అలాగే ఈసీజీ, షుగర్ పరీక్షలు, 2డి ఎకో వంటి వైద్య పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు మాజీ సర్పంచ్ మహమ్మద్ రఫీ గారు తెలిపారు తెలిపారు. ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య సలహాలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు విశేషంగా స్పందించి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. శిబిరం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన వైద్యులు, శ్రీకర హాస్పిటల్ సిబ్బంది, కేర్ టు యాక్షన్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



# ఘనంగా గణపతి నవరాత్రి మహోత్సవాలు

**ముమ్మిడివరం, సెప్టెంబర్ 23 ( మీ వార్త ప్రతినిధి )**
డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం లోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా ఎక్కడ చూసినా అన్న సంతర్పణలు నిర్వహించారు.వర్షాలని సైతం లెక్కచేయకుండా భారీ ఊరేగింపులు నిర్వహించారు.
మంగళవారంలో లంక తల్లిమ్మ అమ్మవారి ఆలయం ఎదురుగా భారీ అన్న సమాధాన జరగగా కొత్తలంక గ్రామంలో భారీ ఎత్తులో అన్న సమారాధన జరగటమే కాకుండా భారీ ఊరేగింపుగా గణపతి విగ్రహ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. కొత్తలంకలో జరిగిన కార్యక్రమంలో పెద్ద లడ్డు లక్ష ఆరువేల రూపాయలకు చిన్న లడ్డు 82 వేల 500 రూపాయలకు పాడుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తోలేటి రాంబాబు, గేదెల రఘునాధ బాబా,జంగారెడ్డి రమేష్,గొర్రెల శ్రీనివాస్,వంగా బాబులు,కుమార్ డాక్టర్ లతో పాటు పలువురు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# బెస్ట్ మనీ గోల్డ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు

**భీమవరం: సెప్టెంబర్ 23: మీ వార్త ప్రతినిధి:** 98 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన బెస్ట్ మనీ గోల్డ్ ఆంధ్రప్రదేశ్ లోని 11వ బ్రాంచ్ ను మన భీమవరం పట్టణంలో ప్రారంభించుకోవడం అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం జెపి రోడ్డులోని మలబార్ గోల్డ్ ఎదురుగా బెస్ట్ మనీ గోల్డ్ నూతన బ్రాంచ్ ను బుధవారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్ లో సుమారు 300 బ్రాంచ్ లతో ఉన్నా బెస్ట్ మనీ గోల్డ్ ఆంధ్రప్రదేశ్ లో 11వ బ్రాంచ్ ఈ ప్రాంతంలో ప్రారంభించారని, అభివృద్ధి చెందుతున్న భీమవరం పట్టణానికి ఎన్నో కార్పొరేట్ సంస్థలు తరలివస్తున్నాయని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. బెస్ట్ మనీ గోల్డ్ జిఎం సెల్వన్, స్టేట్ హెడ్ మధు, సబ్ హెడ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటి వరకు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్ లో సుమారు 300 బ్రాంచ్ లతో ఉన్నాయని, 11వ బ్రాంచ్ ను భీమవరంలో ప్రారంభించుకున్నామని అన్నారు. తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి మార్కెట్ ధరకే అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ బండి రమేష్, వబిలిశెట్టి రామకృష్ణ, మైనార్టీ కార్పోరేషన్ డైరెక్టర్ షబీనా బేగం, కారుమూరి సత్యనారాయణ మూర్తి, ఆకుల కృష్ణ, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.



# వైకల్యం విజయానికి అవరోధం కాకూడదు

**భీమవరం, సెప్టెంబర్ 23: మీ వార్త ప్రతినిధి:** "ప్రపంచ ప్రసిద్ధి రచయిత్రి, ఉపన్యాసకురాలు, దివ్యాంగుల హక్కుల ఉధ్యమకారిణి 'హెలన్ కెల్లర్' చూపు మరియు వినికిడి లేకపోయినా డిగ్రీ పూర్తి చేసిన మొదటి బధిర-అంధురాలుగా ప్రసిద్ధి చెంది ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిందని, బధిరులు చదువులోనే కాకుండా అన్ని రంగాల్లో ప్రతిభను కనబరచాలని, భయం లేకుండా ధైర్యంగా తన భావాలను అందరితో పంచుకోవాలని, ఉపాధ్యాయులు ఆ విధంగా దివ్యాంగులకు తర్ఫీదునివ్వాలని" భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎమ్ సుధారాణి అన్నారు. సెప్టెంబర్ 23 "అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవం" సందర్భంగా వినికిడి లోపం వున్నవారికి సంకేత భాషల ప్రాముఖ్యతను తెలియజేయుటకు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బలుసుమూడిలో వున్న శ్రీ వెంకటేశ్వర బధిరుల పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సుకు న్యాయమూర్తి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. బధిర విద్యార్థులకు అర్ధమయ్యేలా సంకేత భాషల్లో తర్ఫీదు పొందిన ఉపాధ్యాయురాలి సహకారంతో విద్యార్థులతో మాట్లాడి వారి పేరు, చదువు, వారి లక్ష్యం మొదలగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు న్యాయమూర్తి ముందు ఫిజికల్ ట్రైనర్ పర్యవేక్షణలో డాన్స్, స్కిప్పింగ్, యోగా ఆసనాలు వేసి చూపించారు. విభిన్న ప్రతిభావంతులైన దివ్యాంగులకు సరైన విధంగా ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్, ప్యానల్ న్యాయవాదులు అంబేద్కర్, ఉష, అమూల్య, న్యాయవాది సుబ్బరాజు, టూటౌన్ సబ్ ఇన్స్పెక్టర్ రహమాన్, ఇంచార్జి ప్రిన్సిపల్ పుణ్యవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# పెద్ద తుమ్మిడి త్రాగునీరు 13 లక్షల 50 వేలు మంజూరు

## ఐదేళ్ల పాలనలో పూర్తి సంతోషం... మాజీ ఎంపీపీ చినబాబు



**బంటుమిల్లి,సెప్టెంబర్ 23(మీ వార్త ప్రతినిధి)** మండల పరిధిలోని బంటుమిల్లి గ్రామపంచాయతీ పరిధిలో త్రాగునీరు విషయంలో నాణ్యత లేకపోవడం వలన మాజీ ఎంపీపీ వెలివెల చినబాబు దృష్టికి రావడం వల్ల తక్షణమే 13 లక్షల 50 వేలు మంజూరు చేశారు.పనులు కూడా వెంటనే మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు ఇప్పటికే పెద్ద తుమ్మిడి త్రాగునీరు కోసం పది లక్షల రూపాయలు మండల ప్రజా పరిషత్ నిధుల నుండి మంజూరు చేశామని .పనులు కూడా చురుగ్గా జరుగుచున్నాయని నా పదవి కాలం లో ఇది పూర్తికావడం సంతోషం ఉందన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ లకు మండల ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన పోరాడతానన్నారు.

# అభివృద్ధిని తట్టుకోలేక వైసీపీ తప్పుడు ప్రచారం

**డీఎస్సీపై ఆధారాలు, ఆరోపణలు చేయడం మానుకోవాలి:**

**కొనకళ్ల నారాయణరావు**

**మచిలీపట్నం సెప్టెంబర్ 23(మీ వార్త ప్రతినిధి)** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోందని మాజీ ఎంపీ, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు.డీఎస్సీ నియామక ప్రక్రియ నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నప్పటికీ పదేపదే అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదన్నారు. డీఎస్సీపై ఏవైనా అభ్యంతరాలు, ఆధారాలు ఉంటే ప్రజల ముందు ఉంచాలని సవాల్ చేశారు.ఏళ్ల తరబడి కష్టపడి చదివి పోటీ పరీక్షల్లో ప్రతిభ నిరూపించుకున్న అభ్యర్థులపై అనుమానాలు కలిగించేలా మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్యోగార్థులను గందరగోళానికి గురిచేయడం మానుకోవాలని సూచించారు.మంత్రి నారా లోకేష్ పలుమార్లు బహిరంగ చర్చకు ఆహ్వానించిన విషయాన్ని గుర్తుచేస్తూ, డీఎస్సీ నియామకాలు ఏ విధంగా జరిగాయి, ఏ నిబంధనల ప్రకారం జరిగాయి అనే అంశాలపై ఆధారాలతో చర్చకు సిద్ధంగా ఉన్నామని కొనకళ్ల నారాయణరావు స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అమరావతి, పోలవరం, వెలిగొండ తదితర ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తోందన్నారు. మచిలీపట్నం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.51 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.డీఎస్సీపై దుష్ప్రచారం మాని ముందు ఏపీపీఎస్సీపై సమాధానం చెప్పండిపేర్ని నాని రాజకీయ




డ్రామాలను ప్రజలు ఇక నమ్మరు: వీరంకి వెంకట గురుమూర్తి డీఎస్సీపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ నిరుద్యోగ యువతను గందరగోళానికి గురిచేయడం మాజీ మంత్రి పేర్ని నానికి అలవాటుగా మారిందని కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి మండిపడ్డారు.కష్టపడి చదివి, పరీక్షలు రాసి, ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులపై అనుమానాలు కలిగించేలా మాట్లాడటం బాధాకరమన్నారు. డీఎస్సీపై నిజంగా ఆధారాలు ఉంటే వాటితో బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. "పేర్ని నాని గారూ.. డీఎస్సీపై ఇంత మాట్లాడుతున్నారు. మరి మీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ వ్యవహారాలపై ఎందుకు మాట్లాడరు? నిబంధనలు, మూల్యాంకనం, కోర్టు పరిణామాలపై ప్రజలకు సమాధానం చెప్పండి" అని గురుమూర్తి ప్రశ్నించారు.లిక్కర్ కేసు, కృష్ణా డెల్టా సాగునీటి సమస్యలు, సర్పంచ్ ఎన్నికలు తదితర అంశాలపై పేర్ని నాని చేస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ, తన హయాంలో ఆయా అంశాలపై ఏం చేశారో కూడా ప్రజలకు వివరించాలని అన్నారు."డీఎస్సీపై చర్చకు రండి.. ఏపీపీఎస్సీపైనా చర్చిద్దాం.. మీ హయాంలో జరిగిన వ్యవహారాలపైనా చర్చిద్దాం. ఆధారాలతో రండి.. మేము కూడా ఆధారాలతో వస్తాం. ఆరోపణలు చేసి పారిపోవడం కాదు, ప్రజల ముందు కూర్చొని సమాధానం చెప్పే ధైర్యం చూపండి" అని వీరంకి వెంకట గురుమూర్తి సవాల్ చేశారు.

డీఎస్సీపై నిరుద్యోగుల్లో అపోహలు సృష్టించడం మానుకోవాలి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం వల్ల యువతకు నష్టమే: గోపు సత్యనారాయణ డీఎస్సీ నియామక ప్రక్రియపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ నిరుద్యోగ యువతలో అనుమానాలు, అపోహలు సృష్టించడం వైసీపీ నేతలు మానుకోవాలని కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ హితవు పలికారు. కష్టపడి చదివి పోటీ పరీక్షలు రాసిన అభ్యర్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా రాజకీయ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. డీఎస్సీపై ఏవైనా ఆధారాలు ఉంటే వాటిని ప్రజల ముందు ఉంచాలని, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ద్వారా నిరుద్యోగులకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగాల కల్పన, అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించి ముందుకు సాగుతుంటే వాటిని పక్కదారి పట్టించేందుకు వైసీపీ నేతలు రోజుకో అంశాన్ని తెరపైకి తెస్తున్నారని విమర్శించారు.డీఎస్సీపై మాట్లాడుతున్న వైసీపీ నేతలు గతంలో ఏపీపీఎస్సీకి సంబంధించిన అంశాలపై కూడా ప్రజలకు సమాధానం చెప్పాలని, రెండు అంశాలపై ఆధారాలతో చర్చకు రావాలని గోపు సత్యనారాయణ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మోటమర్రి బాబా ప్రసాద్, ఉపాధ్యక్షులు, అధికార ప్రతినిధి కోస్తా మురళీకృష్ణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బచ్చుల సుబ్రహ్మణ్యం (బోస్), కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్ తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



**ముమ్మిడివరంసెప్టెంబరు23 (మీ వార్త విలేఖరి)** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం లో ఎనిమిది రోజులుగా తాము చేస్తున్న నిరవధిక దీక్షలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకుని తమకు న్యాయం చేయాలని ముమ్మిడివరం మండలం విఆర్ఏల సంఘం డిమాండ్ చేసింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విఆర్ఏల సంఘం(జేఏసీ) పిలుపుమేరకు స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట మండల విఆర్ఏ సంఘం ఆధ్వర్యంలో బుధవారం 8వ రోజున నిరసన చేపట్టారు.వర్షాన్ని సైతం లెక్కచేయకుండా జలదీక్ష చేసి నిరసన తెలిపారు.అనంతరం విఆర్ఏలు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా రూ,10,500 వేతనంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు.తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు.నేడు క్యాబినెట్ సమావేశంలో తమ అంశంపై చర్చిస్తామని చెప్పినా ఎటువంటి సమాచారం బయటకు రాలేదన్నారు.విఆర్ఏ లందరికీ తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు చేయాలని,అర్హులైన వీఆర్ఏ లందరికీ 70 శాతం పదోన్నతి కల్పించాలని,నామినీగా పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ వీఆర్ఏలుగా నియమించాలని, మరణించిన వీఆర్ఏ కుటుంబాలలో ఒకరికి కారుణ్య నియామకం క్రింద ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

## పీఎం లంక చిన లంక తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో తహసీల్దార్ నాగార్జున పర్యటన



**నరసాపురం ; సెప్టెంబర్ 23 మీ వార్తా జిల్లా ప్రతినిధి.** తుఫాను ప్రభావంతో తీరప్రాంతమైన నరసాపురం మండలం వేములదీవి, బియ్యపు తిప్ప , చిన్న లంక, పీఎం లంక గ్రామాలను భారీ వర్షాల దృష్ట్యా క్షేత్రస్థాయిలో పర్యటించి రెవెన్యూ ఇన్స్పెక్టర్, విఆర్ఓ, వీఆర్ఏ లకు ఆదేశాలు జారీ చేసినట్లు తహసిల్దార్ తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తుఫాన్ సెంటర్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోని ప్రభావంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున చెట్లు కూలడం కరెంటు స్తంభాలు కూలడం వర్షపు నీరు చేరడం వంటి సంఘటనలు జరిగిన యెడల తక్షణమే స్పందించే విధంగా ఆదేశాలు ఉన్నతాధికారులు జారీ చేశారు. అవసరమైతే ముంపు ప్రాంతాల ప్రజలను ప్రభుత్వ పాఠశాలలు లేదా తుఫాను షెల్టర్ లకు తరలించి ఆహార సదుపాయాలను కల్పించాలని ఆదేశించినట్లు నరసాపురం తాసిల్దార్ నాగార్జున తెలిపారు.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలి

**మార్కాపురం జిల్లా కలెక్టర్ "ఎం.విజయ సునీత"**

**మార్కాపురం : సెప్టెంబర్ 24 (మీ వార్త జిల్లా ప్రతినిధి)** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం రెండో విడత కార్యక్ర మాన్ని సెప్టెంబర్ 25న జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ "ఎం.విజయ సునీత" ఆదేశించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహణపై జిల్లా అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో సన్నద్ధత సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా కార్యక్రమం అమలు,లక్ష్యాలు, శాఖల వారీగా చేపట్టా ల్సిన చర్యలపై సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సుగల సుమారు 2,35,409 మంది పిల్లలు, కిశోర బాల బాలికలకు అల్బెండజోల్ మాత్రలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సెప్టెంబర్ 25న విద్యా సంస్థలు, అంగ న్‌వాడీ కేంద్రాల్లో మాత్రల పంపిణీ చేపట్టాలని, ఆ రోజు మాత్రలు తీసుకోలేక పోయిన వారికి అక్టోబర్ 5 న మాప్-అప్ కార్య క్రమం ద్వారా అందిం చాలని సూచించారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు, డిగ్రీ, ఇంజనీరింగ్, వైద్య కళాశాలల్లోని అర్హులైన విద్యార్థులకు మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలకు వెళ్లని పిల్లలు, దివ్యాంగులు, భవిత కేంద్రాల్లోని పిల్లలకు కూడా సమీప అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాత్రలు అందించాలని తెలిపారు.
1--2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర, 2--19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర ఇవ్వాలని, 1--5 సంవత్సరాల చిన్నారులకు మాత్రను నీటిలో కలిపి ఇవ్వాలని సూ చించారు. మాత్రలను ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పర్యవేక్షణలోనే వేయించాలని స్పష్టం చేశారు. నులిపురుగుల నివారణ ద్వారా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను తగ్గించి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొ న్నారు. కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో గోడపత్రికలు, ఇతర ప్రచార కార్య క్రమాలు నిర్వహించాలని ఆదే శించారు.అల్బెండజోల్ మాత్రల వినియోగంపై తల్లి దండ్రులు, విద్యా ర్థులకు అవగాహన కల్పించాలని, అరుదుగా ఎదురయ్యే ప్రతికూల ప్రభావాలపై తక్షణ వైద్య సేవలు అందించేందుకు రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు, 108 అత్యవసర వైద్య సేవల వాహనాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. కార్య క్రమానికి సంబంధించిన డేటా ఎంట్రీని ఎటువంటి పొరపాట్లకు తావులే కుండా సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.
జాతీయ బాల ఆరోగ్య కార్యక్రమం ద్వారా పుట్టినప్పటి నుంచి 18 సంవత్సరాల వయస్సు వరకు పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకా హార లోపాలు, వ్యాధులు, అభివృద్ధిలో ఆల స్యం, వైకల్యాలు, దృష్టి,




వినికిడి, దంత సమ స్యలు, రక్తహీనత, చర్మవ్యాధులు తదితర ఆరోగ్య సమస్యలను సమగ్రంగా స్క్రీనింగ్ చేసి గుర్తించాలని కలెక్టర్ సూచించారు. గుర్తించిన పిల్లలకు అవసరమైన చికిత్స, తదుపరి వైద్య సేవలు అందేలా రిఫరల్, ఫాలోఅప్ చర్యలు చేప ట్టాలన్నారు.
పోషకాహార పునరావాస కేంద్రాలు ద్వారా తీవ్ర పోషకాహార లోపం తో బాధపడుతున్న పిల్లలకు అవసరమైన వైద్య చికిత్స, పోషకాహార పునరావాసం అందించడంతో పాటు తల్లిదండ్రు లకు పిల్లల పోషణ, ఆరోగ్య సంరక్షణపై అవగాహన,శిక్షణ కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమం విజయ వంతానికి శాఖలు పర స్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే డీసీ డా.డీ.చంద్ర శేఖర్ , వైద్య ఆరోగ్య శాఖ డీఎల్ఏటీఓ ఓ డీఎంఓ డా.కె రాహుల్, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## దైవారాధన మించిన భక్తి మరొకటి లేదు

**శ్రీమావుళ్ళమ్మ ఆలయంలో అన్న సమారాధనను ప్రారంభించిన, గంటా త్రిమూర్తులు,ఎమ్మెల్యే అంజిబాబు**



**భీమవరం : సెప్టెంబర్ 23 మీ వార్తా జిల్లా ప్రతినిధి.**దైవారాధన మించిన భక్తి మరొకటి లేదని, ఆ వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నానని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి ఉపాలయంలోని శ్రీఅశ్వత్థ గణపతి నవరాత్రులలో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షణలో ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు మహా నివేదన చేశారు. ప్రతి ఏడాది గణేష్ ఉత్సవాలలో అన్న సమారాధనలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. అనంతరం వేలాది మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ బండి రమేష్, కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షబీనా బేగం, ఆలయ చైర్మన్ బొండాడ నాగ భూషణం, ఆలయ పాలకవర్గ సభ్యులు రామాయణం శ్రీనివాసరావు, అతికెల ఆంజనేయ ప్రసాద్, పాపోలు ఏడుకొండలు, మీనాక్షి, మల్లువలస రాము లక్ష్మి నిర్మల ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరి వరదలపై ప్రజలకు హెచ్చరిక -- అప్రమత్తంగా ఉండండి

**తహశీల్దార్ వేలేరుపాడు**

**వేలేరుపాడు సెప్టెంబర్23(మి వార్తా ప్రతినిధి)** ఛత్తీస్‌గఢ్, ఒడిశా మరియు తెలంగాణ రాష్ట్రాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదితో పాటు దాని ఉపనదులలో భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. దీనివల్ల గోదావరి నదిలో నీటి మట్టం నిరంతరం పెరుగుతూ ఉన్న తాజా వరద అంచనాల ప్రకారం, భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం (26 సెప్టెంబర్) ఉదయం తెల్లవారు జామున మొదటి హెచ్చరిక స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. అనంతరం (27 సెప్టెంబర్) రెండవ హెచ్చరిక స్థాయికి చేరుకునే అవకాశం ఉందని అంచనా వేయబడింది. ఈ నేపథ్యంలో గోదావరి నది పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాము. గోదావరి నది ఒడ్డున ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలు ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లలు మరియు వృద్ధుల విషయంలో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వరద నీటితో మునిగిపోయిన రహదారులు, వంతెనలు, కల్వర్టులు, వాగులు మరియు ఇతర జలమార్గాలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించవద్దు మరియు జాలరులు చేపల వేటకు నది లోనికి వెళ్ళరాదు.
ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినట్లయితే వెంటనే సంబంధిత మండల తహసీల్దార్ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి. తహశీల్దార్ వేలేరుపాడు మండలం కంట్రోల్ రూమ్ నెంబర్
9014102968
గమనిక: సదరు విషయములో ప్రజలను అప్రమత్తత చేసే విషయంతో బాటు వరద సమయానికి ముందే సంబంధిత మండల శాఖాధికారులు పైన తెలియజేసిన విషయములలో తగు చర్యలు చేపట్టవలసిందిగా తెలియజేయడమైనది.తహశీల్దార్, వేలేరుపాడు



## మాజీ సర్పంచ్ ఆడబాల తాతకాపు పుట్టినరోజు కు హాజరైన- సొసైటీ చైర్మన్ అప్పన వీరబాబు.

**మామిడికుదురు సెప్టెంబర్ 23( మీ వార్త విలేఖరి రవి).** లూటుకుర్రు గ్రామ ముద్దుబిడ్డ, స్నేహశీలి,అందరివాడు,జనసేన పార్టీ మాజీ మండల అధ్యక్షులు, మాజీ గ్రామ సర్పంచ్ అడబాల తాతకాపు పుట్టినరోజు కి పాశర్లపూడిలంక సొసైటీ చైర్మన్ అప్పన వీరబాబు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మరియు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆశీస్సులతో వచ్చే స్థానిక సంస్థలు ఎన్నికలో ఆయన ఉన్నతమైన పదవి చేపట్టాలని సొసైటీ చైర్మన్ పేర్కొన్నారు.అప్పన వీరబాబు పాటుగా సొసైటీ డైరెక్టర్ ఇంజే నాగేశ్వరరావు,ఇంజే రవి కుమార్, పుట్టినరోజుకి హాజరయ్యారు.



## 172 మంది లబ్ధిదారులకు రూ.1.04 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**పి.గన్నవరం(మీవార్త విలేఖరి ):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయనిధి) చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ గిడ్డి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ రోజు 172 మంది లబ్ధిదారులకు రూ.1,04,51,927 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని అన్నారు.పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరికీ మెరుగైన వైద్యం దూరం కాకూడదనే ఉద్దేశంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఇప్పటివరకు పి.గన్నవరం నియోజకవర్గంలో 1,661 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.10,62,79,056 సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందినట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీలకు గుర్తింపు తెచ్చిన నాయకుడు ఎమ్మెల్యే బొలిశెట్టి

## పెంటపాడు ఎంపీపీ కట్టుపోయిన వెంకటలక్ష్మీ కృష్ణ ప్రసాద్

**పెంటపాడు సెప్టెంబర్ 23 (మీ వార్త ప్రతినిధి)** ఎంపీటీసీలకు గుర్తింపు వచ్చేలా అభివృద్ధి పనుల నిమిత్తం శిలాఫలకాలు వేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారని పెంటపాడు మండల పరిషత్ అధ్యక్షురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మీ కృష్ణ ప్రసాద్ అన్నారు. పెంటపాడు మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశంను ఎంపీపీ వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఇదే సందర్భంలో ఎంపీటీసీల పదవీకాలం బుధవారం ముగియడంతో వారిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తరపున ఆయన తనయుడు బొలిశెట్టి రాజేష్ ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎంపీపీ దంపతులు రాజేష్ ను గజమాలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టి తొమ్మిది నెలలే అయినప్పటికీ మండలం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ఎంపీపీ దంపతులను ఆయన ప్రశంశించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ లాంటి నాయకుడు రాజకీయాల్లో ఉండాలన్నారు.
గత పాలకులకు అభివృద్ధిపై ఆలోచన లేదన్నారు. మన ఊరు బాగుంటేనే నియోజకవర్గం బాగుంటుందన్నారు. మంచి వ్యక్తిని ఎన్నుకుంటే గ్రామాభివృద్ధి బాగుంటుందని, ఎమ్మెల్యే ఎవరిని సూచిస్తే వారి



గెలుపునకు కూటమి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
ఎంపీపీ మాట్లాడుతూ తాము చేసిన అభివృద్ధి శిలాఫలకాలను నిర్మించి వాటిని ప్రారంభించే అవకాశం కల్పించి తమ పదవులకు వన్నె తెచ్చేలా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రోత్సహించారని కొనియాడారు. ముప్పై మూడు కోట్ల రూపాయలతో చేసిన అభివృద్ధి పనులను ఎంపీపీతో సహా ఆయా ఎంపీటీసీలు ప్రారంభించేందుకు అవకాశం కల్పించిన ఏకైక నాయకుడు బొలిశెట్టి అని అన్నారు. పార్టీలకు అతీతంగా కూటమి ప్రభుత్వం ఎంపీటీసీలకే కాకుండా ప్రతిపక్ష ఎంపీటీసీలకు కూడా ప్రారంభోత్సవ అవకాశాలు కల్పించడం గర్వకారణమని అన్నారు. జగన్ గతంలో ఏకగ్రీవాలకు తావు లేకుండా ప్రతి గ్రామంలో ఎన్నికలు జరగాలని చెప్పడం గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పంచాయతీలు ఏకగ్రీవం అయితే అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని చెప్పి, నేడు ఏకగ్రీవాలకు తావు లేకుండా ప్రతి గ్రామంలో ఎన్నికలు జరపాలని చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ భర్త కృష్ణ ప్రసాద్ గతంలో వైసీపీకి ఎనలేని సేవ చేశారని, ఆ సమయంలో ఎంపీపీగా ఒక అవకాశం కల్పించాలని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణను కోరినా ఆయన పట్టించుకోలేదని మండిపడ్డారు. కానీ ఎమ్మెల్యే బొలిశెట్టిని కోరిన వెంటనే ఎంపీపీని చేసి చూపించారని ప్రశంసించారు. తొమ్మిది నెలల కాలంలో చేసిన సేవను తొమ్మిదేళ్ల పాలనగా భావిస్తున్నానని తెలిపారు. పాలనలో సహకరించిన తోటి ఎంపీటీసీలకు, అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉప్పులూరి వరలక్ష్మి, ఎంపీడీవో ముప్పిడి వెంకటేశు, తహసీల్దార్ వై రవికుమార్, వైస్ ఎంపీపీలు కొణతాల వెంకట్రావు, ముప్పిడి సరోజినీ, జనసేన పార్టీ పెంటపాడు మండలం అధ్యక్షుడు పుల్లా బాబీ, తెలుగుదేశం పార్టీ పెంటపాడు మండలం అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు, ద్వారకాతిరుమల పాలకమండలి సభ్యురాలు కసిరెడ్డి మధులత, ఏఎంసి డైరెక్టర్ కొవ్వూరి లక్ష్మణరెడ్డి, మట్ట సత్యనారాయణ, నీలపాల దినేష్ కుమార్ యాదవ్, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైకల్యం విజయానికి అవరోధం కాకూడదు




**భీమవరం, సెప్టెంబర్ 23: మీ వార్త ప్రతినిధి:** "ప్రపంచ ప్రసిద్ధి రచయిత్రి, ఉపన్యాసకురాలు, దివ్యాంగుల హక్కుల ఉద్యమకారిణి 'హెలన్ కెల్లర్' చూపు మరియు వినికిడి లేకపోయినా డిగ్రీ పూర్తి చేసిన మొదటి బధిర–అంధురాలుగా ప్రసిద్ధి చెంది ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిందని, బధిరులు చదువులోనే కాకుండా అన్ని రంగాల్లో ప్రతిభను కనబరచాలని, భయం లేకుండా ధైర్యంగా తన భావాలను అందరితో పంచుకోవాలని, ఉపాధ్యాయులు ఆ విధంగా దివ్యాంగులకు తర్ఫీదునివ్వాలని" భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎమ్ సుధారాణి అన్నారు. సెప్టెంబర్ 23 "అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవం" సందర్భంగా వినికిడి లోపం వున్నవారికి సంకేత భాషల ప్రాముఖ్యతను తెలియజేయుటకు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బలుసుమూడిలో వున్న శ్రీ వెంకటేశ్వర బధిరుల పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సుకు న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బధిర విద్యార్థులకు అర్థమయ్యేలా సంకేత భాషల్లో తర్ఫీదు పొందిన ఉపాధ్యాయురాలి సహకారంతో విద్యార్థులతో మాట్లాడి వారి పేరు, చదువు, వారి లక్ష్యం మొదలగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు న్యాయమూర్తి ముందు ఫిజికల్ ట్రైనర్ పర్యవేక్షణలో డాన్స్, స్కిప్పింగ్, యోగా ఆసనాలు వేసి చూపించారు. విభిన్న ప్రతిభావంతులైన దివ్యాంగులకు సరైన విధంగా ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్, ప్యానల్ న్యాయవాదులు అంబేద్కర్, ఉష, అమూల్య, న్యాయవాది సుబ్బరాజు, టూటౌన్ సబ్ ఇన్స్పెక్టర్ రహమాన్, ఇంచార్జి ప్రిన్సిపల్ పుణ్యవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పిఆర్సి కమిటీని వెంటనే నియమించాలి



**పుల్లలచెరువు, సెప్టెంబర్ 23 ( మీ వార్త)** పిఆర్సి కమిటీని వెంటనే నియమించి ఐ.ఆర్ ప్రకటించాలని మార్కాపురం జిల్లా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ( యుటిఎఫ్ ) ప్రధాన కార్యదర్శి ఓ వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పుల్లలచెరువు మండలంలో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను నిరంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తూ ఆ సమస్యలను పరిష్కరించడంలో యుటిఎఫ్ ముందంజలో ఉందని అన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని లేనిపక్షంలో అర్హత మార్కులనైనా తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల యూటీఎఫ్ అధ్యక్షులు కే ఉదయభాస్కర్, ప్రధాన కార్యదర్శి జె కాటంరాజు, జిల్లా కౌన్సిలర్లు ఆర్ మోహన్ బాబు, దేశావత్ వెంకటేశ్వర్లు నాయక్ లు, ఉపాధ్యక్షులు అల్లూరి శ్రీను, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ రూపుల్ నాయక్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తున్న వైసిపి నేత వడ్డీ

**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 23 (మీ వార్త ప్రతినిధి)** నియోజకవర్గంలోని అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, ప్రమాదాల్లో గాయపడిన వారిని, అకాల మరణాలతో విషాదంలో ఉన్న కుటుంబాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ వడ్డీ రఘురాం నాయుడు బుధవారం పరామర్శించారు. పెంటపాడు మండలం బి కొండేపాడు గ్రామానికి చెందిన అట్టి రమణబాబు కాలుకు ప్రమాదం జరిగిందన్న విషయం తెలుసుకున్న వడ్డీ రఘురాం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రామచంద్రపురం గ్రామానికి చెందిన తిప్ప మల్లికార్జునరావు అకాల మరణం చందడంతో వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. తాడేపల్లిగూడెం మండలం పుల్లయ్యగూడెం గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు మార్లపూడి సుబ్బారావు కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న రఘురాం ఆయనను పరామర్శించి రూ 10 వేలను



ఆర్థిక సహాయం అందజేశారు. బంగారు గూడెం గ్రామంలో మాజీ ఎంపీటీసీ బుర్రకట్టయ్య కుమారుడు శ్రీను, కంచర్ల వెంకటేష్ చేతులకు గాయాలు కావడంతో ఆయన వారిని పరామర్శించారు. అనంతరం గడిశెట్టి రత్న మాణిక్యం, కొల్లి సహదేవ్ కుటుంబాలను ప్రమర్శించి వారికి ధైర్యం చెప్పారు.
డాన్స్ చేస్తూ మృతి చెందిన కాకర్లమూడి ఏసు అండగా నిలిచిన వడ్డీ రఘురాం తాడేపల్లిగూడెం పట్టణం ఎల్ అండ్ టి కాలనీకి చెందిన టాక్సీ యూనియన్ సభ్యుడు కాకర్లమూడి ఏసు ఇటీవల వినాయక నిమజ్జనం వేడుకల్లో హఠాన్మరణం చెందిన విషయం తెలుసుకున్న వడ్డీ రఘురాం నాయుడు బుధవారం యేసు కుటుంబ సభ్యులను కలిసి వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అంతేకాక రూ 10 వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ పర్యటనలలో ఆయన వెంట వైసీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గణేష్ నగర్ సెంటర్లో అంగరంగ వైభవంగా గణేష్ నవరాత్రి



**కుక్కునూరు సెప్టెంబర్ 23(మి వార్తా ప్రతినిధి)** కుక్కునూరు గణేష్ నగర్ సెంటర్లో అంగరంగ వైభవంగా గణేష్ నవరాత్రి మహోత్సవములు తొమ్మిది రోజుల నవరాత్రులు జరుపుకొని మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఊరేగింపు లో భక్తులందరూ స్వామివారి ని దర్శించుకున్నారు ఈ ఈ ఊరేగింపు కార్యక్రమంలో గణేష్ నగర్ కమిటీ మెంబర్లు అలాగే గణేష్ నగర్ కాలనీవాసులు అందరూ పాల్గొన్నారు....

# పదవి ముగిసినా ప్రజాసేవ కొనసాగాలి

## మండల ప్రజా పరిషత్ సభ్యుల పదవీరమణ కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**అంబాజీపేట సెప్టెంబర్ 23 ( మీ వార్త విలేఖరి )** పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవకు ముగింపు కాదని, ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తూ ప్రజల గొంతుకగా నిలవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పదవీకాలం పూర్తిచేసుకుంటున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులకు అభినందన సభ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పదవీకాలంలో గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కృషిచేసిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యుల సేవలు అభినందనీయమన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా ఎన్నికైన రోజునే



పదవీకాలం ముగిసే తేదీ నిర్ణయించబడుతుందని, అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో చేరిన రోజునే వారి పదవీ విరమణ తేదీ కూడా ఖరారవుతుందని చెప్పారు. పదవి తాత్కాలికమైనప్పటికీ ప్రజలకు చేసిన సేవలు శాశ్వతంగా గుర్తుండిపోతాయని తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని పదవీకాలం పూర్తిచేసుకుంటున్న ప్రజాప్రతినిధులకు సూచించారు. అభినందన సభను ఏర్పాటు చేసిన మండల ప్రజాపరిషత్ అధికారులు, సిబ్బందికి ఎమ్మెల్యే ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం



పదవీకాలం పూర్తిచేసుకుంటున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావును , ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సత్కరించారు. మండల ప్రజాపరిషత్ పాలకవర్గ సభ్యులు, ఎంపీడీవో, అధికారులు కలిసి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా గణనాధుని ఊరేగింపు



**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 23 (మీ వార్త ప్రతినిధి)** కడియద్ద శ్రీలక్ష్మీగణపతి వినాయకచవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా గణనాధుని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఊరేగింపు లో బాగంగా వినాయక చవితి రోజున ఏర్పాటు చేసిన గణనాధుని చేతిలో లడ్డులు వేలంలో రూ.66500కు పాడుకున్నారు. చవితి నుం చి పూజలందుకున్న లడ్డు ప్రసాదం సొంతం చేసుకునేందుకు గ్రామస్తులు పోటి పడ్డారు. మొత్తం అరులడ్డులకు గాను ఒక లడ్డు రూ.30వేలకు పరిమి కిరణ్, రూ.13వేలకు దారపురెడ్డి బ్రదర్స్, మద్దిపాటి సత్యనారాయణ రూ.7500 మరో లడ్డు, పాలడుగు నరేంద్ర రూ.5 వేలకు, వేదూరి నాగేశ్వరరావు రూ.6వేలకు అత్తలూరి మణికంఠ రూ.5 వేలకు లడ్డులు దక్కించుకున్నారు. ఆ వేలం లో పాడుకున్న లడ్డులను లక్ష్మీగణపతి ఉత్సవ కమిటి అద్వర్యంలో మేళ తాళాలతో లడ్డు ఊరేగిం పు నిర్వహించారు. స్వామివారి ఊరేగింపులో భక్తులు స్వామివారికి పూలు, పండ్లుతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు. స్వీకరించారు.

# తాడేపల్లిగూడెంలో టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన వలవల బాబ్జి

**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 23 (మీ వార్త)** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తాడేపల్లిగూడెం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్, ఏపీ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జీ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం నిర్వహించే విస్తృత స్థాయి సమావేశం పార్టీ బలోపేతానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ కింద 19 మంది లబ్ధిదారులకు రూ. 11,54,405 విలువైన చెక్కులను బాబ్జీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్ చౌదరి, పద్మనాభుని మురళి, ములగాల బాబ్జి, ముప్పిడి రమేష్, పట్టణ, మండల క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# రాజోలు గణేష్ నిమజ్జన మహోత్సవాన్ని ప్రారంభించిన -ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

**రాజోలు సెప్టెంబర్ 23( మీ వార్త విలేఖరి రవి).** రాజోలు గ్రామంలో నిర్వహించిన గణేష్ నిమజ్జన మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ దేవ వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గణేష్ నిమజ్జనాలను ప్రారంభించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో



గణనాథుడిని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

Edited Printed Published & Owned by U. SHEKHAR. And Printed at Mani Raghava Printers, #A-20, Vambay Colony, Hyderabad, Rajendranagar, Rangareddy, Telangana.
Published at Manikanta Publications, H.No. 3-67/3/66, Netaji Nagar, Nallagandla, Serilingampally, Rangareddy (Dist), Telangana, EDITOR U.SHEKHAR, RNI. NO. TEL/2018/77112

# నాగోల్‌లో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో మేగా రక్తదాన శిబిరం పాల్గోన్న ఎంపి ఈటల

**మేడ్చల్ :** ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాక్షేత్రంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా, దేశవ్యాప్తంగా నిర్వహి స్తున్న “సేవా సంకల్ప్ అభియాన్”లో భాగంగా ఈరోజు భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో నాగోల్ లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో ఎంపి ఈటల రాజేందర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్ర శేఖర్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి ఈటల మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ 77వ వసంతంభలోకి అడుగుపెట్టారు. 25 ఏళ్ల గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా వారు అందించిన సేవలు దేశం గర్వపడుతుంది. రతజాతి కులాలు మతాలు ప్రాంతాలకు అతీతంగా ఆయన్ని గుర్తించి గౌరవిస్తుంది. ప్రపంచ చిత్రపటం మీద దేశ ఔన్నత్యాన్ని మోదీ రు పెంచారు అనడంలో సందేహం లేదని అన్నారు. భారతదేశం సొంత కాళ్ళ మీద నిలబడి మోడ్రన్ రైల్వే సిస్టం, ఎయిర్పోర్టు, వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు ఏర్పాటు చేస్తున్నారు. మౌలిక సదుపాయాల కోసం 2014 కంటే ముందు 2 లక్షల కోట్ల రూపాయల ఖర్చు చేస్తే ఇప్పుడు 15 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాం. దేశాన్ని గొప్పగా తీర్చిదిద్దుతున్నారు. ఆయన ఎప్పుడూ నేను పాలకున్ని అని అనరు, సేవకున్ని మాత్రమే అని చెప్తారు. 76 సంవత్సరాల వయసులో కూడా ఒక్కరోజు కూడా సెలవు లేకుండా నిరంతరం యంత్రంలాగా పనిచేస్తూ దేశాన్ని ముందుకు తీసుకుపోతున్న మోదీ గారు మరింత ఆరోగ్యవంతంగా ఉండి,



ప్రజల ఆశీర్వాదం పొంది, భగవంతుని దయతో మరింత సేవా అందించాలని కోరుతున్నామని అన్నారు. ఈరోజు బీజే వైయం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించాము. ఇందులో పాల్గొని రక్త దానం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు , బండ కార్తీక , రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎన్. గౌతం రావు, తుళ్ల వీరేందర్ గౌడ్ , బీజేవైయం రాష్ట్ర అధ్యక్షులు కుండె గణేష్ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి మాజీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని 14 లక్షల మంది విద్యార్థుల స్కాలర్ షిప్‌లు - ఫీజులు వెంటనే చెల్లించాలి

**విద్యానగర్ నుంచి వేలాదిమంది విద్యార్థులతో భారీ ప్రదర్శన**

**రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై ఆర్.కృష్ణయ్య ఫైర్**

**హైద్రాబాద్ :** రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల స్కాలర్ షిప్లు, ఫీజుల బకాయిలు 8500కోట్లు వెంటనే విడుదల చేయాలని, ఈ స్కీము ఎత్తివేయాలనే కుట్రలు మానుకోవాలని, ఈ స్కీమును యధాతధంగా పాత పద్ధతిలోనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు నేడు విద్యానగర్ నుంచి భారీ ప్రదర్శన జరిపారు. ఈ ప్రదర్శనకు బిసి సంక్షేమ సంఘం సంఘం జాతీయఅధ్యక్షులు, రాజ్య సభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ స్కీముకు బడ్జెట్ ఇవ్వకుండా ముఖ్యమంత్రి పేద కులాల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఫీజుల బకాయిలు ఇవ్వాలని శాంతియుతంగా ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు చదువుకుంటుంటే కూడా ఓర్వలేక పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని పేద కులాలు చదువుకోకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.ఈ ఫీజుల బకాయిలు 8500 కోట్లు చెల్లించడం ముఖ్యమంత్రికి ఒకలెక్క కాదు. మూడున్నర



సంవత్సరాలుగా విద్యార్థులు పడుతున్న భాదలు చెప్పతరం కాదు. కోర్సు పూర్తి అయిన 6 లక్షల మందికి కాలేజి యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదు. వీరికి ఉద్యోగాలు వచ్చిన చేరలేక - ఉన్నత విద్యకు పోలేక చాల ఇబ్బంది పడుతున్నారు. చదువుతున్న వారి ఫీజులు కట్టే వరకు కాలేజీలకు రానివ్వడంలేదు. ఫీజుల బకాయిలు చెల్లించక పోవడంతో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ భారీ ప్రదర్శనలో రాష్ట్ర బి.సి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, రాష్ట్ర బి.సి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ నిఖిల్ పటేల్, అధ్యక్షులు పగిళ్ళ సతీష్, బి.సి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి. రాజేందర్, నరేష్ గౌడ్, శివ కుమార్ యాదవ్, రమేష్, రాహుల్, సురేష్, రమణ, కె. వంశీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# నయీం హత్య కేసులో మరో ముగ్గురి అరెస్ట్

**ప్రధాన సూత్రధారి ఉమామహేష్ సహా ఇద్దరి అరెస్ట్**

**అదుపులో మొత్తం 11 మంది నిందితులు**

బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో రౌడీషీటర్ మహమ్మద్ నయీం హత్య కేసులో పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి సహా ముగ్గురిని నాగోల్ పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. ఖమ్మంకు చెందిన కె.ఉమామహేష్ అలియాస్ జేకే మహేష్ (34), సాయినగర్‌కు చెందిన మహమ్మద్ మున్నా అలియాస్ బోలె (47), ఖమ్మం జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దుగ్గిరాల కార్తీక్ (29)లను ఎల్.బి.నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 14న బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీమ్‌పై నిందితులు వేటకొడవళ్లతో దాడి చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఈ నెల 16న ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారి ఉమామహేష్ మాత్రం అప్పటి నుంచి పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. తాజాగా అతడితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. నయీం, ఉమామహేష్ బాల్య స్నేహితులు. చిన్నతనం నుంచే నేరాలకు పాల్పడటంతో ఇల్లందు పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరిపై రౌడీషీట్లు ఉన్నాయి. కొంతకాలంగా ఇల్లందు, కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు చేస్తూ ఉండేవారు. ఓ రియల్ ఎస్టేట్ సెటిల్మెంట్లో విభేదాలు రావడంతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండగా, ఉమా మహేష్ ఖమ్మంలో సోలార్ ప్యానల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కాగా ఇద్దరి మధ్య ఏర్పడిన విభేదాలు ఒకరిపై ఒకరు కక్ష పెంచుకునేలా దారితీసింది. నయీంను హత్య చేసేందుకు ఈ నెల 13న ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఉమా మహేష్ తన అనుచరులతో కలిసి పథకం రచించి మరుసటి రోజు ఖమ్మం



నుంచి నిందితులు కారులో హైదరాబాద్‌కు చేరుకున్నారు. మున్నా ద్వారా నయీంకు ఫోన్ చేసి అతడి ఆచూకీ తెలుసుకున్నారు. బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీం ఉన్నట్లు నిర్ధారించుకుని అక్కడికి వెళ్లి అతడి కళ్లలో కారం చల్లి వెంబడించిన నిందితులు.. హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మంది అరెస్టు కాగా.. తాజాగా మరో ముగ్గురి అరెస్టుతో మొత్తం అరెస్టుల సంఖ్య 11కు చేరింది. కాగా ఈ కేసులో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్, ఐపీఎస్ బి.సుమతి ఆదేశాలతో ఎల్.బి.నగర్ డీసీపీ బి.అనురాధ, ఎస్ఓటి ఏసీపీ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో నాగోల్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పరారీలో ఉన్న నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టి ప్రధాన సూత్రధారి ఉమామహేష్‌తో పాటు మరో పదిమంది నిందితులను అరెస్టు చేసినట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు.

## బెట్టింగ్ డబ్బులకోసం చైన్ స్నాచింగ్

**కూకట్‌పల్లి :** బెట్టింగ్ యాప్‌లకు బానిసై, ఓ వ్యక్తి మహిళ మెడలోని పుస్తెలతాడు లాక్కెళ్లిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్ బస్టాప్ వద్ద ఓ మహిళ తన కుమార్తెను స్కూల్ బస్సు ఎక్కించేందుకు వెళ్లింది. బస్సు మిస్ కావడంతో కూకట్‌పల్లి వై జంక్షన్ వరకు బస్సును అనుసరించి, అక్కడ తన కుమార్తెను బస్సు ఎక్కించింది. అనంతరం ఇంటికి వెళ్లేందుకు వై జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా.. కూకట్‌పల్లి నుంచి బాలానగర్ వైపు వెళ్తున్న ఓ వ్యక్తి ఆమె మెడలోని పుస్తెలతాడును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ స్వామిగౌడ్ ఆధ్వర్యంలో డీఐ శంకర్‌రెడ్డి నేతృత్వంలోని క్రైమ్ బృందం సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిందితుడు తుకారాంను అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు నష్టపోవడంతోనే దొంగతనానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని ఏసీపీ నరేష్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా క్రైమ్ సిబ్బందిని ఏసీబీ అభినందించారు.

## పటాన్చెరు లొ జరిగిన క్యాబ్ డ్రైవర్ హత్య కేసు ను ఛేదించిన సైబరాబాద్ పోలీసులు

**శేరిలింగంపల్లి :** పటాన్ చెరు పటాన్చెరు పరిధిలో సంచలనం సృష్టించిన క్యాబ్ డ్రైవర్ హత్య,దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. మహారాష్ట్రకు చెందిన ఘోడకే రాహుల్,సూరజ్ శశికాంత్,బాంబ్లే రాజులను అరెస్ట్ చేసారు. మరో ఇద్దరు నిందితులు ఉన్నానపి శేరిలింగంపల్లి టీపీసీ శ్రీనివాస్ వెల్లడించారు. సెప్టెంబర్ 10 రాత్రి సికింద్రాబాద్లో ముంబై వెళ్లాలంటూ డ్రైవర్ నెలమత్రి రాజశేఖర్ క్యాబ్ను నిందతులు మాట్లాడుకున్నారు. మార్గమధ్యలో రుద్రారం సమీపంలో టవల్ తో గొంతు నులిమి అతడిని హత్య చేసారు. మృతదేహాన్ని బ్రిడ్జి వద్ద పడేసారు. తరువాత కారుతో ముంబై పారిపోతుండగా కోహిర్ వద్ద వాహనం మొరాయించడంతో అక్కడే వదిలేసి పరరైయారు. బంగారు దుకాణాల్లో చోరీలకు కారు ఉపయోగించి చివరకు అమ్మేయాలని నిందితుల ప్లాన్. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి రేమండ్ కు తరలించారు.

## మాకు ఉద్యోగ భద్రత కల్పించండి మహాప్రభో - పార్ట్ టైం టీచర్ లెక్చరర్స్



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కౌన్సిలింగ్ జిల్లా రామచంద్రపురం (మీ వార్తా ప్రతినిధి సెప్టెంబర్ 23) ద్రాక్షారామ పట్టణం నాకు సమీపంలో ఉన్న ాూ్రూాెజెౌ=జు× లో గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాల యొక్క సిబ్బంది తమకు ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని అంతేకాకుండా పెండింగ్లో ఉన్న శాలరీని వెంటనే విడుదల చేసి పార్ట్ టైం గా ఉన్న వారిని తక్షణమే కాంట్రాక్ట్ టీచర్స్ గా కన్వర్ట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని గత కొన్ని సంవత్సరాలుగా కొద్దిపాటి జీతాలతో తమ జీవనాన్ని కొనసాగిస్తున్న వారికి న్యాయం చేయాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీనివాస్ రావు కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉన్న పార్ట్ టైం టీచర్స్ అందరూ నల్ల బ్యాడ్జీలతో తమ నిరసన తెలిపారు వారికి తమ తగిన న్యాయం జరగకపోతే జిల్లా నాయకులు రాష్ట్ర నాయకులు తగిన నిర్ణయాలు తీసుకుని న్యాయపోరాటం చేస్తామని వారన్నారు ఈ కార్యక్రమంలో గురుకులంలో పనిచేస్తున్న పార్ట్ టైం టీచర్స్ అందరూ పాల్గొన్నారు...

## ఘనంగా పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న -మాజీ సర్పంచ్ అడబాల తాతకాపు



**మామిడికుదురు సెప్టెంబర్ 23( మీ వార్త విలేఖరి రవి)**నాయకులు,మాజీ మండల అధ్యక్షులు,పి.గన్నవరం నియోజకవర్గం సర్పంచ్ సమాఖ్య అధ్యక్షులు, లూటుకూర్రు ముద్దుబిడ్డ , స్నేహశీలి, అందరివాడు,మాజీ సర్పంచ్ అడబాల రామసత్యనారాయణ మూర్తి (తాత కాపు) పుట్టినరోజు వేడుకలు తన గ్రామంలో తన ఇంటి దగ్గర ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు జాలెం శ్రీనివాసరాజా, బోనం నాగేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పెనుమల లక్ష్మి, టిడిపి జిల్లా ఉపఅధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ కొమ్ముల కొండలరావు, మండల యూత్ అధ్యక్షులు బల్ల సతీష్, సొసైటీ చైర్మన్ మంద గాంధీ, అప్పనపల్లి సీనియర్ నాయకులు కంకిపాటి నరసింహారావు, బాడీలంక సీనియర్ నాయకులు విల్ల సుబ్బారావు,సొసైటీ చైర్మన్ అప్పన వీరబాబు, ఎంపీటీసీ సభ్యులు కొమ్మల జంగమయ్య, చెరుకూరి పార్వతి దేవి సత్తిబాబు, పాశర్లపూడి లంక గ్రామ శాఖ తెల్లగారెడ్డి బుల్లి నాగేశ్వరరావు,మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు పినిశెట్టి చంద్రశేఖర్, అదుర్రు మాజీ సర్పంచ్ బల్ల సత్యనారాయణ,మాజీ ఉప సర్పంచ్ తుండూరుబుజ్జి,నగరం గ్రామశాఖ వాన రాశి ప్రసాద్, ఇంజే రవి కుమార్, కొమ్మల శివ సాయి,కొమ్ముల రాము మరియు సీనియర్ నాయకులు,గ్రామ పెద్దలు,కూటమి నాయకులు,గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు,అభిమానులు,పి గన్నవరం నియోజకవర్గం కార్యకర్తలు, అభిమానులు భారీ వర్షాన్ని లెక్కచేయకుండా పుట్టినరోజుకి హాజరయ్యారు.

## రామసేన సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా వినాయకుని ఊరేగింపు...



**గోకవరం సెప్టెంబర్ 23: ( మీ వార్త విలేఖరి ):** వినాయక నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకొని, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక తంటికొండ రోడ్డులోని సీఎండీ లే అవుట్ వద్ద ఏర్పాటు చేసిన గణపతి మండపం ఊరేగింపు, కార్యక్రమం బుధవారం సాయంత్రం రామసేన సిబ్బంది, సభ్యులు,నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. తొలిత సీఎండీ లే అవుట్ వద్ద గణపతి మండపానికి రామసేన సభ్యులు బత్తుల నానాజీ కొబ్బరికాయ కొట్టి ఊరేగింపుని ప్రారంభించారు. సీఎండీ లే అవుట్ నుంచి దేవిచౌక్ మీదగా బావోజీ పేట, వరకు పలు నృత్యాలు, కోలాటం, బాణసంచ కాల్పులతో ఊరిగింపు ఘనంగా సాగింది. అనంతరం బావోజీ పేట గోదావరి పాయ కాలువలో వినాయకుడికి వీడ్కోలు చెబుతూ నిమజ్జనం చేసారు..ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రామసేన రామసేన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు...